# మహానాడు

జనం గుండె చప్పుడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 26, అక్టోబర్ 2024 ‖ ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం


## శభాష్ దినకర్!



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిసి 20 సూత్రాల కార్యక్రమాల అమలు సంబంధించి నీతి ఆయోగ్ సూచించిన 17 ఎస్డీజీ అంశాలను అనుసంధానం చేస్తూ కేంద్ర ప్రాయోజిత పథకాలు మరియు ప్రాజెక్టుల ద్వారా " స్వర్ణాంధ్ర 2047 " కోసం ఏకీకృత " స్వర్ణాంధ్ర సాధన సూత్రాలు " అవసరం పైన నోట్ సమర్పించిన చైర్మన్ లంకా దినకర్. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావలసిన గ్రాంట్లు, ఇతర సాయం వివరాలను తన నోట్‌లో పొందుపరిచారు. దీనిపై కసరత్తు చేసిన దినకర్‌ను సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు.

### • ష్.. గప్‌చుప్

# సింహాం సిగ్గుపడింది!



- షర్మిల సవాలుకు జవాబు లేని జగన్
- తాను చెప్పడానికి సిగ్గుపడి నానితో చెప్పించిన జగనన్న
- మీ ఇళ్లలో కలహాలు లేవా అని టీడీపీ, చానెళ్ల యజమానులపై జగన్ ఎదురుదాడి
- కుటుంబ కలహాల గురించి పేర్ని చెప్పినా ఫర్వాలేదా?
- ఆస్తుల పంచాయతీ అసలు గుట్టు విప్పిన చెల్లెమ్మ
- ఆ తర్వాతయినా స్పందించని జగన్
- కనీసం భారతీతోనయినా ప్రకటన ఇప్పించే సాహసం చేయని తీరు
- తాను చెప్పకుండా పార్టీ నేతలతో చెప్పిస్తున్న వైచిత్రి
- చెప్పడానికి సిగ్గుపడ్డారా? అమ్మచెల్లెమ్మకు భయపడ్డారా?
- మహిళల్లో జగన్ ఇమేజీకి భారీ డ్యామేజీ
- జగన్ లేదా భారతీ చెబితేనే బాగుంటుందన్న వైసీపీ సీనియర్లు
- ప్రకంపనలు సృష్టిస్తున్న 'మహానాడు' కథనం

(మార్తి సుబ్రహ్మణ్యం)

'సింహం సింగిల్‌గా వస్తుంది'.. ఇది ఎన్నికల ముందు నగ రి రోజక్క నుంచి గుడివాడ కొడాలి నాని వరకూ, తాదాత్మ్యంతో జగన్‌భక్తజనం తొడకొట్టి చెప్పిన డైలాగు. అంటే జగనన్న సింహం అన్నది వారి కవి హృదయం. సరే. ఆ సింహం ఓటమి పరాభవంతో కర్నాటక అడవులకు వెళ్లి, మళ్లీ ఇప్పుడు జనారణ్యంలోకి వస్తుందనుకోండి అది వేరే కథ. ఇప్పుడు ఆ సింహం అచ్చంగా.. చెల్లి సింహం పెను గర్జనకు సమాధానం లేక సిగ్గుపడింది. చెల్లి కళ్లలో కళ్లు పెట్టి, జవాబు చెప్పే ధైర్యం లేని జగన్ అనే మాజీ సింహం.. తన పరివారంతో సమాధానం చెప్పిస్తుండడమే విషాదం. ఇదంతా.. 'మహానాడు'లో వైఎస్ కుటుంబంలో పరాకాష్ఠకు చేరిన 'పులివెందుల పైసల పంచాయతీ' కహానీ ప్రకంపనలే.



మహానాడు
23 Oct 2024 - Page 1

'షేర్' ఫ్యామిలీలో షేర్ల ఫైట్

తల్లి, చెల్లిని కోర్టుకీడ్చిన జగన్

SARASWATHI POWERS AND INDUSTRIES


వైఎస్ కుటుంబంలో అన్నాచెల్లెల మధ్య జరుగుతున్న పైసల పెనుగులాట, చివరాఖరకు ఎన్‌సీఎల్‌టీకి చేరిన వైనంపై, ముందుగా రాసిన 'మహానాడు' కథనం.. వైసీపీలో బాంబులా పేలింది. అంతకుముందు రోజు అన్నాచెల్లెల మధ్య రాయబారం జరుగుతోందని, కాంగ్రెస్‌లో చేరికకు చెల్లెమ్మ షర్మిలను, అన్నయ్య జగన్ వేడుకుంటున్నారన్న చర్చలకు టీవీ చానెళ్లు తెరలేపాయి. వాటిని జనం కూడా నిజమే కామోననుకున్నారు. ఎందుకంటే జగన్ ఈమధ్య కాలంలో కాంగ్రెస్ దారిలో నడుస్తున్నారు కాబట్టి!

అయితే అందుకు భిన్నంగా.. తన చెల్లి, తల్లికి చిల్లిగవ్వ ఇచ్చేది లేదని, ఆ మేరకు వారితో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలంటూ జగన్,ఆయన భార్య భారతీరెడ్డి కోర్టుకె క్కారంటూ, 'మహానాడు' బయటపెట్టిన కథనంతో.. చానెళ్లు తమ చర్చలను అర్జంటుగా, అన్నాచెల్లెల కోర్టు కిరికిరిపైకి మళ్లించారు. ఇంకేముంది? ఆగమాగం. గత్తర గత్తర! అచిరకాలంలోనే తెలుగు పాఠక దేవుళ్ల ఆదరాభిమానాలు సంపాదించిన.. 'మహానాడు' డిజిటల్ పేపర్ సృష్టించిన ఆ సంచలన వార్తపైనే, ఇప్పుడు నెట్టింట చర్చల రచ్చ.

"అయ్యా చంద్రబాబూ.. అయ్యా ఏబీఎన్ రాధాకృష్ణా, అయ్యా ఈనాడు రామోజీ, అయ్యా టీవీ 5 నాయుడు, మీ ఇంట్లో ఏమీ గొడవలు లేవా? మా ఇంట్లో గొడవలపై పేపర్లలో వేసి గోల గోల చేస్తున్నారు. ఇవన్నీ ఘర్‌ఘర్‌కీ కహానీ. ప్రతీ ఇంట్లో ఉండేవే"– ఇదీ.. తన మనస్తత్వంపై సొంత చెల్లి షర్మిల చేసిన ఆరోపణలకు, జగన్ ఆమెకు మినహా మిగిలిన వారికి.. బాధాతప్త హృదయంతో ఇచ్చిన జవాబు. తన కుటుంబ గొడవలపై మీడియాలో కథనాలు రావడం ఆయనను తెగ బాధించినట్లు జగన్ మాటలు స్పష్టం చేస్తున్నాయి.

తల్లి–చెల్లికి ఇచ్చిన షేర్లు వెనక్కితీసుకున్న జగన్‌ను.. "నువ్వు ఇలా చేస్తావని వైఎస్ ఏనాడూ ఊహించి ఉండరు. విలువలు, విశ్వసనీయత అనేవి నీకు అసలు లేవు. నువ్వు దిగజారిపోయావు. ఇది సామాన్యం అంటూనే, అన్ని కుటుంబాల్లో జరిగేదే

మిగతా.. 2లో




# చెత్త నుంచి సంపద సృష్టించండి

- వచ్చే గాంధీ జయంతి నాటికి సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ గాడిలో పడాల
- అమృత్ పథకం ద్వారా మరో 7.5 లక్షల ఇళ్లకు కూడా కుళాయి కనెక్షన్ ఇచ్చేలా పనులు పూర్తి
- పీపీపీ పద్ధతిలో పార్కులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు
- మున్సిపల్ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష
- పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, వేస్ట్ మేనేజ్మెంట్, టౌన్ ప్లానింగ్, టిడ్కో ప్రాజెక్ట్ లపై చర్చ



**అమరావతి,మహానాడు:** రాష్ట్రంలో అతిపెద్ద సమస్యగా ఉన్న చెత్త తొలగింపు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

మిగతా.. 2లో

### నవంబర్ నెలాఖరులోగా

# స్పోర్ట్స్ పాలసీ

- దేశంలోనే అత్యుత్తమ పాలసీగా ఉండాలి
- స్పోర్ట్ యూనివర్సిటీ బిల్లు సత్వరమే రూపొందించాలి
- వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలో నేషనల్ గేమ్స్ నిర్వహించేలా చూడాలి
- ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మహానాడు:** తెలంగాణ రాష్ట్ర క్రీడా విధానానికి (స్పోర్ట్స్ పాలసీ) సంబంధించిన తుది ముసాయిదా (ఫైనల్ డ్రాఫ్ట్)ను నవంబరు నెలాఖరులోగా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మనం రూపొందించే



పాలసీ దేశంలోనే అత్యుత్తమ పాలసీగా ఉండాలని, అందుకు విస్తృత అధ్యయనం, నిపుణులు, క్రీడాకారులతో విస్తృత స్థాయిలో సంప్రదింపులు చేయాలని ఆయన సూచించారు.

తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ పాలసీపై తన నివాసంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అందుబాటులో ఉన్న క్రీడా వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, ఇప్పటికే ఉన్న స్టేడియాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి సంబంధించిన బిల్లు సాధ్యమైనంత త్వరగా రూపొందించాలని ఆయన

మిగతా.. 2లో



02

ఐదు డీఏ బకాయిలు ఒకేసారి చెల్లింపు?



03

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



08

అర్హులకు దీపావళి నుండి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు!



08

రేవంత్ రెడ్డి సొంత మంత్రులు ప్రతిపక్ష నేతల ఫోన్లు టాప్ చేస్తున్నారు

# అవును.. అది నా అబ్బ సొమ్ము

- నీ ఆస్తులు కావు
- నువ్వు గార్డియన్‌వి మాత్రమే
- మోసం చేసింది నువ్వే
- నా పోరాటం నా ఆస్తి కోసం కాదు
- వైఎస్ కోరిక నెరవేర్చడం కోసం
- సీఎం అయిన నెలరోజులకే విడిపోదాం అని ఇజ్రాయిల్ పర్యటనలో ప్రతిపాదన పెట్టారు
- రాజశేఖర్ రెడ్డి గారి కుమారుడే సొంత తల్లిని కోర్టుకి ఈడ్చడం, ఆ తల్లికి ఎంత అవమానం?
- టీడీపీ హ్యాండిల్ లో పోస్ట్ అయితే నాకు ఏం సంబంధం? నేనైతే బైబిల్ మీద ప్రమాణం చేయగలను
- జగనన్న నైజాన్ని ఎండగడుతూ వైఎస్ అభిమానులకు బహిరంగలేఖ రాసిన ఏపీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి





**విజయవాడ,మహానాడు:** ఇప్పటి ఆస్తులన్నీ కష్టార్జితమేనన్న తన అన్న, వైసీపీ అధ్యక్షుడు జగన్ మాటలను ఖండిస్తూ.. ఆయన చెల్లి, ఏపీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి తాజాగా ఒక లేఖాస్త్రం సంధించారు. అందులో తన తండ్రి ద్వారా సంక్రమించిన ఆస్తుల వివరాలు, ఇప్పటివరకూ జరిగిన పంపకాలు, పెండింగ్‌లో ఉన్న ఆస్తుల వివరాలను ఆమె వైఎస్ అభిమానులకు తన బహిరంగలేఖ ద్వారా వెల్లడించారు. కాబట్టి "అవన్నీ మన తండ్రి సంపాదించిన ఆస్తులే తప్ప నువ్వు సంపాదించినవు కాదు. నువ్వు మాకేమీ ఇవ్వాల్సిన పనిలేదు. నువ్వు కేవలం గార్డియన్‌వి మాత్రమే"నంటూ నిర్మొహమాటంగా తన లేఖలో పేర్కొన్నారు. వైఎస్ అభిమానులకు షర్మిల రాసిన బహిరంగలేఖ పూర్తి పాఠం ఇదీ..

మిగతా.. 3లో

### రేవంత్ రెడ్డి లాగులో

# వంద తొండలు ఇడుస్తారు

- ఎమ్మెల్యే సంజయ్‌పై మర్డర్ కేసు ఎందుకు నమోదు చేయలేదు?
- కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేల పరిస్థితి బ్రోకర్ల కంటే హీనంగా మారింది
- గంగా రెడ్డిని హత్య చేసి జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ బహుమతి ఇచ్చింది
- తెలంగాణ పైసలు వయానాడ్ కు హెలికాప్టర్ లో ప్రియాంక గాంధీకి ఇచ్చి వస్తున్నారు
- ప్రభుత్వంలో ఉండి రెడ్ బుక్ ఎట్లా పెడతారు?
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి




**హైదరాబాద్,మహానాడు:** ఆరు గ్యారెంటీలు అడిగితే సీఎం రేవంత్ రెడ్డి బూతులు తిడుతున్నారు. హామీలు అమలు చేయకపోతే తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డి లాగులో వంద తొండలు ఇడుస్తారు. ఓటు ద్వారా ప్రజలు రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడం ఖాయం.

జగిత్యాలలో స్వయంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హత్య చేయించారని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చెప్తున్నారు. జగిత్యాల ఎస్సీ ఎమ్మెల్యే సంజయ్ పై మర్డర్ కేసు ఎందుకు

మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 26, అక్టోబర్ 2024 ‖

# నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు మొదలు

◆ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు

**అమరావతి, మహానాడు:** తెలుగుదేశం పార్టీ(టీడీపీ) సభ్యత్వ నమోదు కార్యక్రమం నేటి నుంచి మొదలు కానుంది. ఈ కార్యక్రమాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో ప్రారంభించనున్నారు. రూ.లక్ష రూపాయలు కట్టిన వారికి టీడీపీ నుండి శాశ్వత సభ్యత్వం అందించనున్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ శు



క్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు రికార్డు స్థాయిలో నిర్వహించాలని, కేవలం రూ.100తో పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద బీమా రూ.5 లక్షలు అమలు కానుందని ఆయన తెలిపారు. గతంలో ప్రమాద బీమా రూ.2 లక్షలు ఉండగా దాన్ని రూ. 5 లక్షలకు పెంచామన్నారు.

సభ్యత్వం కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి చనిపోయిన రోజే అంత్యక్రియలకు రూ.10,000 అందిస్తారని, వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధి కోసం పార్టీ సాయం అందిస్తుందని శ్రీనివాస్ పేర్కొన్నారు.

## చెత్త నుంచి సంపద సృష్టించండి

**మొదటి పేజీ తరువాయి..**

గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేసి...చెత్త తొలగించని కారణంగా 83 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త మిగిలిందని, దీన్ని వచ్చే జూన్ నాటికి పూర్తిగా తొలగించాలని సీఎం సూచించారు.

వేస్ట్ టు ఎనర్జీ, చెత్త నుంచి సంపద కేంద్రాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చి, చెత్త సమస్యకు పరిష్కారం చూపాలని సీఎం అధికారులను ఆదేశించారు. సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రక్రియ పక్కాగా జరగాలని, ఆ మార్పు రాష్ట్రంలో ప్రతి చోటా కనిపించాలని సీఎం అధికారులను ఆదేశించారు. వచ్చే గాంధీ జయంతి నాటికి సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మనేజ్మెంట్ గాడిలో పడాలని ఆదేశించారు.

రాష్ట్రంలో టిడిఆర్ బాండ్లలో జరిగిన అక్రమాలపై సమగ్ర సమాచారం సేకరించాలని ఆదేశించారు. ఇప్పటికే వెలుగు చూసిన ఘటనపై మరింత సమాచారం సేకరించడంతో పాటు...ఇతర కార్పొరేషన్ లలో జరిగిన అక్రమాలను సైతం బయటకు తీయాలని ఆదేశించారు. అర్బన్ లోకల్ బాడీలలో మొత్తం 50 లక్షల గృహాలు ఉండగా...ఇప్పటి వరకు 30 లక్షల ఇళ్లకు నీటి కుళాయి సౌకర్యం ఉందని, మరో 7.5 లక్షల ఇళ్లకు అమృత్ పథకం కింద కుళాయి ద్వారా నీరు ఇచ్చేందుకు పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. అయితే అమృత్ పథకం ద్వారా మరో 7.5 లక్షల ఇళ్లకు కూడా కుళాయి కనెక్షన్ ఇచ్చేలా పనులు పూర్తి చేయాలని సీఎం సూచించారు. తిరుపతి, రాజమండ్రి, కాకినాడ, నెల్లూరులో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్స్ టెండర్లు, ఇతర ప్రక్రియ వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సీఎం ఆదేశించారు. అదే విధంగా టిడ్కో ఇళ్ల ప్రాజెక్టు స్థితిగతులపైనా అధికారులు సీఎంకు వివరించారు.

ఈ ప్రాజెక్టును సక్రమంగా పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల కేటాయింపునకు ప్రభుత్వం సిద్దంగా ఉందని, దీనిపై ప్రత్యేకంగా సమీక్ష చేసి నిర్ణయాలు తీసుకుందామని సీఎం అన్నారు. పట్టణ ప్రాంతంలో ఇంకా ఇళ్ల నిర్మాణం ఏ మేర చేపట్టాలి. లబ్దిదారులు ఎందరు ఉంటారు అనే విషయంలో నివేదిక రూపొందించాలని సిఎం అన్నారు.

వేస్ట్ మేనేజ్మెంట్, అర్బన్ ప్లానింగ్ వంటి విభాగాల్లో డ్రోన్లను సమర్థవంతంగా ఉపయోగించుకుని ఫలితాలు రాబట్టాలని సీఎం సూచించారు. పీపీపీ పద్దతిలో పార్కులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టాలని సీఎం సూచించారు.

**మొదటి పేజీ తరువాయి..**

అధికారులను ఆదేశించారు.

తెలంగాణ స్పోర్ట్స్ పాలసీలో భాగమైన యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (YIPESU), యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ (YISA), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు (SATG) సంబంధించి పలు వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. అందులో చేయాల్సిన మార్పులుచేర్పులను ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ దేశంలోనే అత్యుత్తమంగా ఉండాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

తన దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా అక్కడి కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించిన సందర్భంగా గుర్తించిన అంశాలను ముఖ్యమంత్రి తెలియజేశారు.. రెండు రోజుల క్రితం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి దక్షిణ కొరియా క్రీడా వర్సిటీ ప్రతినిధులతో చర్చించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. దక్షిణ కొరియా క్రీడా వర్సిటీతో పాటు క్రీడా రంగంలో ప్రపంచంలోనే అత్యుత్తమైనదిగా గుర్తింపు పొందిన ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ యూనివర్సిటీ అనసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. మరో పది రోజుల్లోనే స్పోర్ట్స్ పాలసీకి సంబంధించిన గవర్నింగ్ బాడీని ఖరారు చేయాలని సీఎం ఆదేశించారు.

రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు సంబంధించిన క్యాలెండర్ ను వెంటనే తయారు చేయాలన్నారు. వచ్చే రెండేళ్లలో నేషనల్ గేమ్స్ కు తెలంగాణ రాష్ట్రం ఆతిథ్యం ఇచ్చేలా ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ను సంప్రదించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

సమీక్షలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి కార్యదర్శి షానవాజ్ ఖాసీం, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి లాగులో వంద తొండలు ఇడుస్తారు

**మొదటి పేజీ తరువాయి..**

నమోదు చేయలేదు? మార్కెట్ కమిటీ చైర్మన్‌పదవి కోసం సంజయ్ మారు గంగారెడ్డిని తన అనుచరుడితో హత్య చేయించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ఎమ్మెల్యే సంజయ్ నారాయణరెడ్డి పేరును ప్రపోజల్ చేశారు. ఎమ్మెల్యేపై మర్డర్ కేసు నమోదు చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అంటున్నారు. తెలంగాణలో హత్యా రాజకీయాలను ఎందుకు ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా?

నేను కాంగ్రెస్ పార్టీలో చేరలేదని ఎమ్మెల్యే సంజయ్ అంటున్నారు. గాంధీ భవన్ లో జరిగే కాంగ్రెస్ మీటింగ్ కు ఎమ్మెల్యే ఎందుకు హాజరయ్యారు రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. బిఆర్ఎస్ పార్టీ నుండి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేల పరిస్థితి బ్రోకర్ల కంటే హీనంగా మారింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఎందుకు రాజీనామా చేయడం లేదు? పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రాక తప్పదు. రేవంత్ రెడ్డి హోంమంత్రి గా ఉంటే రాష్ట్రంలో మర్డర్లు జరుగుతున్నాయి. మేము అధికారంలోకి వస్తే మొత్తం బయటపెడతాము. కరీంనగర్ జిల్లాలో 40ఏళ్లుగా జీవన్ రెడ్డి కాంగ్రెస్ జెండా మోశారు. గంగా రెడ్డిని హత్య చేసి జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ బహుమతి ఇచ్చింది. జగిత్యాల ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్,ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అంటున్నారు. రాహుల్ గాంధీ మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఏం చేయాలని అనుకుంటోంది?సీఎం,మంత్రులు టూర్లలో బిజీగా ఉన్నారు. ప్రజలు అయోమయంలో ఉన్నారు. సీఎం ఢిల్లీ, కేరళ టూర్లు తిరుగుతున్నారు. మంత్రులు పొంగులేటి, పొన్నం సౌత్ కొరియా టూర్లు. మంత్రి తుమ్మల మలేషియా టూర్. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హెలికాప్టర్ కోసం గొడవలు పడుతున్నారు.

తెలంగాణను రేవంత్ రెడ్డి నాశనం చేస్తున్నారు. ఆరు గ్యారెంటీలు ఇచ్చే వరకు రేవంత్ రెడ్డిని వదలం యాదగిరి గుట్ట టెంపుల్ బయట మేము ఫోటో షూట్ చేశాము. ఈవో పర్మిషన్ తీసుకున్నాకే ఫోటో షూట్ తీశాము. కేసీఆర్ కట్టించిన యాదాద్రి టెంపుల్ ప్రపంచానికి తెలియాలని ఫోటో షూట్ చేశాము. పార్లమెంట్ ఎన్నికల్లో మాకు సీట్లు ఇవ్వాలని కేసీఆర్ చెప్పారు.

తెలంగాణ పైసలు వయానాడ్ కు హెలికాప్టర్ లో తీసుకువెళ్లి ప్రియాంక గాంధీకి ఇచ్చి వస్తున్నారు. ఏ అధికారి ఓవర్ యాక్షన్ చేసినా వారి పేర్లు రాసుకుంటాము. తెలంగాణ కేసీఆర్సీఎం కాక తప్పదు. ఏపీలో ముగ్గురు ఐపీఎస్ లు సస్పెండ్ అయ్యారు. ప్రభుత్వంలో ఉండి రెడ్ బుక్ ఎట్లా పెడతారు? పొంగులేటి ఇంట్లో ఈడీ రైడ్స్‌లో దొరికిన 700 కోట్ల డబ్బు దొరికిన విషయాన్ని బాంబ్ పేల్చుతారేమో. పొంగులేటి రేవంత్ రెడ్డికి ఎప్పుడు బాంబ్ పెడతారో అని వేచి చూస్తున్నాం. కాంగ్రెస్ కార్యకర్తలకే రక్షణ లేదు.

# ఐదు డీఏ బకాయిలు ఒకేసారి చెల్లింపు?

- ◆ తొలి విడతలో మూడు డీఏలకు నగదు చెల్లింపు?
- ◆ మిగిలిన రెండు డీఏలకు నిర్దిష్ట గడువులో చెల్లింపు?
- ◆ బాండ్లు లేదా నగదుపై అస్పష్టత
- ◆ పెండింగ్ డీఏలన్నీ ఒకేసారి చెల్లించిన ఘనత సొంతం చేసుకోనున్న రేవంత్‌రెడ్డి
- ◆ దేశంలోని సీఎంలకు ఆదర్శంగా రేవంత్‌రెడ్డి సరికొత్త సాహసం
- ◆ ఉద్యోగుల మనసు గెలవనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ◆ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకు సిద్ధం
- ◆ విపక్షాల విమర్శలకు అవకాశం ఇవ్వకుండా ఎత్తుగడ
- ◆ ఉద్యోగులను శాశ్వతంగా కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా మార్చుకునే వ్యూహం
- ◆ 10 లక్షల మంది తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్ల పెదవులపై చిరునవ్వులు
- ◆ 600 కోట్ల రూపాయల విడుదలకు సిద్ధమవుతున్న రేవంత్ సర్కార్?

**(మార్తి సుబ్రహ్మణ్యం)**

అధికారంలోకి వచ్చిన పదినెలల అచిరకాలంలోనే రైతులు, మహిళలు, విద్యార్థుల మనసు గెలిచిన సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్.. ఇప్పుడు 10 లక్షలమంది తెలంగాణ ఉద్యోగ, పెన్షనర్లు, ఇతర శాఖల సిబ్బంది పెదవులపై చిరునవ్వులు పూయించే సంచలన నిర్ణయానికి సిద్ధమవుతున్నారు.

అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, పెన్షనర్లు, ఇతర సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏ బకాయిలను ఒకేసారి చెల్లించడం ద్వారా.. దేశంలోని ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలిచే ప్రణాళికలకు ఊపిరిపోస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ రకంగా 600 కోట్ల రూపాయలు విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సచివాలయ వర్గాల సమాచారం.

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. తెలంగాణలోని 10లక్షల మంది ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రేవంత్‌రెడ్డి సర్కారు శుభవార్త వినిపించనుంది. ఇది ఇప్పటివరకూ దేశంలోని ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని సాహసంగానే కనిపిస్తోంది. అదేమిటంటే..

కేసీఆర్ జమానా నుంచి ఇప్పటివరకూ పెండింగ్‌లో ఉన్న 5 డీఏ బకాయిలను ఒకేసారి విడుదల చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధమవుతోందన్న వార్తలు వినిపిస్తున్నాయి.

నిజానికి రెండు డీఏ బకాయిలు కూడా ఒకేసారి చెల్లించలేని





పరిస్థితి ఉన్నప్పటికీ.. ఉద్యోగ వర్గాలను శాశ్వతంగా మెప్పించేందుకు, కొంత సాహసం చేయడం తప్పదంటున్నారు. అదీగాక గత ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో ఉద్యోగులు కీలకపాత్ర పోషించారు. గతంలో జిల్లాల వారీగా జీతాలు ఇచ్చే పరిస్థితి ఉండగా, రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ఒకటి, రెండు తేదీల్లోనే జీతాలిస్తుండటంతో ఉద్యోగ వర్గాలు సంతోషంగా ఉన్నాయి. అయితే ఎన్నికల మేనిఫెస్టోలో అన్ని డీఏ బకాయిలను చెల్లిస్తామన్న హామీ మాత్రం అలాగే ఉండిపోయింది.

పది నెలలయినప్పటికీ, దానిపై ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో, ఉద్యోగుల్లో మళ్లీ అసంతృప్తి మొలకెత్తడం ప్రారంభించింది. అది పెరిగి పెద్దదయితే ఉద్యోగుల్లో ప్రభుత్వ వ్యతిరేకత పెరగడం- అది విపక్షాలకు అస్త్రంగా మారడం ఖాయమని గ్రహించిన సర్కారు నష్టనివారణకు దిగింది. ఉద్యోగుల అసంతృప్తి పెరిగి పెద్దది కాకముందే, వారి అసంతృప్తికి శాశ్వతంగా తెరదించాలని నిర్థయించినట్లు చెబుతున్నారు.

అందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏ బకాయిలను ఒకేసారి విడుదల చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే అందులో మూడు డీఏ బకాయిలకు నగదు చెల్లించాలని నిర్ణయించారంటున్నారు. మిగిలిన రెండు డీఏలకు బాండ్లు ఇవ్వడమా? లేదా నిర్దిష్ట గడువులోగా విడతల వారీగా చెల్లించడమా అన్న అంశంపై కసరత్తు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

బహుశా మిగిలిన రెండు డీఏ బకాయిలు మార్చిలో చెల్లిస్తామని హామీ ఇవ్వడం ద్వారా, ఉద్యోగులను మెప్పించవచ్చని భావిస్తోంది. నిజానికి ఉద్యోగులు మిగిలిన రెండు డీఏ బకాయిలను మార్చిలో ఇచ్చినా సంతోషమేనంటున్నారు. ఆ ఉద్దేశంతోనే రేవంత్‌రెడ్డి.. మార్చివరకూ తమపై ఒత్తిడి తీసుకురావద్దని ఉద్యోగ జేఏసీ నేతలను కోరినట్లు చెబుతున్నారు.

ప్రస్తుతానికి రెండు డీఏలు చెల్లిస్తారన్న ప్రచారం జరుగుతోంది. అదే నిజమైతే 300 కోట్ల రూపాయలు చెల్లించాల్సి వస్తుంది. కానీ దానికి బదులు..ఎవరూ ఊహించని విధంగా మూడు డీఏ బకాయిలకు సంబంధించి 450 కోట్లు ఒకేసారి చెల్లించడం ద్వారా, తెలంగాణ ఉద్యోగుల మనసులో చిరస్థాయిగా నిలిచిపోవాలని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పైగా ఇది బీఆర్ఎస్-బీజేపీలకు అస్త్రం కాకుండా నిలువరించవచ్చన్న మరో వ్యూహమంటున్నారు.

నిజానికి రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉంది. వివిధ శాఖల్లో పనిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో, వారు కొత్త పనులు చేయడంలేదు. కొన్ని జిల్లాల్లో కాంట్రాక్టర్లు ధర్నాలు చేస్తున్న పరిస్థితి. ఉన్న ఆదాయం జీతాలు, అప్పులకు సంబంధించిన వడ్డీ చెల్లింపులకే సరిపోతున్నాయి. గత నెలలో ఎక్సైజ్‌పై ఆశించిన ఆదాయం కూడా రాలేదు. కొత్తగా తీసుకున్న ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలోనూ ఇబ్బంది పడుతోంది. అదే విషయాన్ని నిన్న జేఏసీ భేటీలో సీఎం ఉద్యోగ సంఘ నేతల వద్ద వాపోయినట్లు తెలిసింది.

అయినప్పటికీ.. మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ఐదు పెండింగ్ డీఏ బకాయిలు చెల్లించడం ద్వారా, ఉద్యోగ వర్గాలను శాశ్వత ఓటు బ్యాంకుగా మార్చుకోవచ్చన్నది రేవంత్ సర్కారు యోచనగా కనిపిస్తోందంటున్నారు. అయితే ఇందుకు నిధుల సమస్య ప్రతిబంధకంగా ఉన్నప్పటికీ.. మిగిలిన ప్రాధాన్యతలు తగ్గించుకుని, ఆ నిధులు పెండింగ్ డీఏ బకాయిలల కోసం కేటాయించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఇదే నిజమైతే సీఎం రేవంత్‌రెడ్డి.. తెలంగాణ ఉద్యోగుల మనసులో చిరస్థాయిగా నిలవడంతోపాటు, దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలిచిపోవడం ఖాయం.

# సింహం సిగ్గుపడింది!

**మొదటి పేజీ తరువాయి..**

అంటూనే తల్లి-చెల్లిని కోర్టుకు ఈడ్చాడు. ఇది సామాన్యమైన విషయం కాదు సార్" అని నిక్కచ్చిగా నిందలు వేసింది స్వయంగా ఆయన మాజీ ముద్దుల చెల్లెమ్మ షర్మిల! దీనికి సంబంధించి సోషల్‌మీడియాలో జగన్‌ను విమర్శిస్తూ వస్తున్న పోస్టులు, గ్రాఫిక్స్ జగన్‌ను మహిళలకు దూరం చేసేలా ఉన్నాయన్న ఆందోళన పార్టీలో వ్యక్తమవుతోంది.

మరి ఇందులో మీడియాకు ఏం సంబంధం ఉందని, వారిపై జగన్ విమర్శలు కురిపించారో ఎవరికీ అర్ధం కాని ప్రశ్న. తల్లి-చెల్లికి ఇస్తానన్న షేర్లు ఇచ్చేది లేదంటూ.. జగన్ స్వయంగా సంతకం పెట్టి, ఎన్‌సీఎల్‌టీలో వేసిన పిటిషన్‌పైనే కదా మీడియా కథనాలు రాసింది. దానిపై డిబేట్లు పెట్టింది. జగన్ సొంత మీడియా కూడా గతంలో ఇదే మాదిరిగా, చంద్రబాబు, పవన్, లోకేష్‌పై కథనాలు వండివార్చింది.

ఇంకొంచెం వెనక్కి వెళితే.. అనారోగ్యంతో ఉన్న చంద్రబాబునాయుడు తమ్ముడు నారా రామ్మూర్తినాయుడు దగ్గరకెళ్లి, ఆయన నోటి దగ్గర గొట్టం పెట్టిన జగన్ మీడియా.. ఆయనతో సొంత అన్న చంద్రబాబును తిట్టించింది. దానిని తర్వాత నానా రచ్చ చేసింది. ఆ తర్వాత తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న రామోజీరావు కొడుకు సుమన్ కొడుకుతో, అదే జగన్ మీడియా తండ్రిని తిట్టించింది. బుల్లితెర నటుడు ప్రభాకర్‌తో కలసి నిలువెత్తు పేజీలో ఇంటర్వ్యూ రాసింది. తామిద్దరం రాముడు-సీత లాంటివాళ్లమని చెప్పించడం ద్వారా, సుమన్ వ్యక్తిత్వాన్ని హననం చేసింది. లోకేష్ విదేశాల్లో చదువుకుంటున్నప్పుడు స్విమ్మింగ్‌పూల్‌లో ఉన్న ఫొటోలతో నానా యాగీ చేసింది.

ఎన్నికల ముందు ఎన్టీఆర్ కుమార్తె ఉమా మహేశ్వరి మృతి చెందారు.అయితే దానిని కూడా చంద్రబాబుతో ముడిపెట్టిన జగన్ మీడియా, ప్రధానంగా గుర్రంపాటి దేవేందర్‌రెడ్డి గులేబాకావలి కథనాలు వండివార్చారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 54లోని, ఫలానా సర్వే నెంబర్‌లోని 6 ఎకరాల భూమి గురించి లోకేష్ ఆమెను దూషించారని రాశారు. హెరిటేజ్‌లో ఆమె పెట్టిన 500 కోట్ల పెట్టుబడికి సంబంధించి చంద్రబాబు ఆమెను బెదిరించారని, అందుకే ఆమె ఆత్మహత్య చేసుకుందని దేవేందర్‌రెడ్డి ట్వీట్ చేశారు. తర్వాత మీడియా ప్రతినిధులు రంగంలోకి దిగి, జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 54లోని ఫలానా సర్వే నెంబర్‌లోని, 6 ఎకరాల భూమి గురించి ఆరా తీస్తే.. అసలు అక్కడ అంత స్థలం లేదని తేలిపోయింది. అంటే ఆమె మరణాన్ని కూడా రాజకీయం చేసినట్లు ఇక్కడ స్పష్టంగా అర్థమవుతుంది.


కానీ ఇప్పుడు స్వయంగా తన సొంత తల్లి,చెల్లి జమిలిగా తనపై విరుచుకుపడి.. నీకు విశ్వసనీయత-విలువలేవని దుమ్ము దులిపేస్తుంటే.. దానికి నేరుగా-సూటిగా తల్లీచెల్లికి సమాధానం ఇవ్వకుండా, ఎన్‌సీఎల్‌టీలో జగన్ వేసిన పిటిషన్‌నే రాసిన మీడియాను విమర్శించడమే వింత. అంటే తన మీడియా ఇతరులపై రాస్తే, అది జాతి ప్రయోజనాల కోసం.. అదే తన కుటుంబంపై మీడియా రాస్తే అది గోల. బురద! ఇదేం సిద్ధాంతమన్నది బుద్ధిజీవుల ప్రశ్న. ఇక విజయనగరం జిల్లా పర్యటనకు వెళ్లిన జగన్.. తన కుటుంబ రగడ గురించి మీడియా చేస్తున్నరచ్చ గురించి బోలెడంత ఆవేదన వ్యక్తం చేశారు. మీకు అక్కాచెల్లెళ్లు లేరా అని అడిగినంత పనిచేశారు. మీ ఇంట్లో ఇవి జరగవా అని మీడియా యాజమాన్యాలను ప్రశ్నించారు.

అంటే తాను బురదలో ఉన్నందున, మిగిలిన వారికీ ఆ బురద అంటించాలన్నదే జగన్ అసలు లక్ష్యమన్నది విశ్లేషకుల వ్యాఖ్య. జగన్ చెప్పింది నిజమే. కలహాలు-మనస్పర్థలు అన్ని చోట్లా ఉంటాయి. ఆయన ప్రశ్నించిన మీడియా అధిపతుల ఇళ్లలో కూడా ఉండి ఉండవచ్చు. కానీ జగన్‌కు ఉండకూడదు. ఉండటానికి వీల్లేదు కూడా! చాలామంది జగన్లు.. తల్లి-చెల్లిని మెడబట్టి బయటకు గెంటవచ్చు. వారి ఆస్తులు కాజేయవచ్చు. కానీ విలువలు-విశ్వసనీయత గోతాలకు గోతాలు, టన్నులకు టన్నులున్న పులివెందుల ముద్దుబిడ్డ జగన్ ఇంట్లో మాత్రం అవి ఉండకూడదు. ఎందుకంటే ఆయన ఆదర్శప్రాయుడైన అన్న. కొడుకుగా ఉండాలని మహిళలు కోరుకుంటారు కాబట్టి!

నా తల్లులు, నా అక్క చెల్లెమ్మలంటూ పలవరించి, వారి నెత్తిన చేయి-ముద్దులు పెట్టే జగనన్నయ్యలో అక్కచెల్లెమ్మలు.. ఆస్తులు పంచే అన్నయ్యను చూస్తారే తప్ప, ఇచ్చిన ఆస్తులు గుంజుకునే పాత సినిమాలో విలన్ అన్నయ్యను చూడలేరు. ఎందుకంటే జగన్ తన గురించి తాను ఇప్పటిదాకా ఇచ్చుకున్న బిల్డప్ అది మరి!

ఇప్పుడు అందుకు భిన్నమైన దృశ్యాలు కనిపిస్తున్నందుకే, అక్కచెల్లెమ్మల్లో అన్నయ్య ఇమేజీ దారుణంగా డామేజీ అవుతోంది. తల్లి-చెల్లికి ఇచ్చిన ఆస్తులు లాగేసుకునేందుకు, వారిని కోర్టుకు ఈడ్చిన జగన్.. వారి దృష్టిలో ఇకపై అఖిలాంధ్రకోటి అన్నయ్య' ఎలా అవుతారన్నది మహిళల ప్రశ్న.

అసలు తనపై చెల్లి సంధించిన ప్రశ్నలకు జగన్ సమాధానం ఇవ్వకుండా, పేర్ని నానితో మాట్లాడించడమే ఆశ్చర్యం. నాని కాకుండా ఏ రోజాతోనో, ఏ లక్ష్మీపార్వతతితోనో, ఏ కల్యాణితోనో, ఏ విడదల రజనీతోనే మాట్లాడిస్తే బాగుండేది. ఎస్సీ లీడర్లపై ఎస్సీలను,




బీసీలపై బీసీలను, కమ్మవాళ్లపై కమ్మవాళ్లతో తిట్టించే సూత్రం.. మహిళ ను మహిళతో తట్టించాలన్న ఆలోచన జగన్‌కు రాకపోవడమే విచిత్రం.మీడియోముందుకొచ్చిన పేర్ని నాని.. దివంగత వైఎస్ తన ఆస్తులను పిల్లలు, భార్యకు అప్పుడే పంచేశారని, ఇప్పుడు ఉన్నవన్నీ జగన్ రెక్కలకష్టంతో, తినీ తినకుండా కడుపుకట్టుకుని సంపాదించిన ఆస్తులేనని సెలవిచ్చారు. వాటిలో కొన్ని వివరాలు కూడా వెల్లడించారు. చెల్లి షర్మిలంటే ప్రేమానురాగాలున్నందుకే, తన షేర్లు రాసిచ్చారని చెప్పిన పేర్ని... మళ్లీ వాటిని ఎందుకు లాక్కునే ప్రయత్నం చేశారో చెప్పలేదు.

ఇన్నేసి అంతఃపుర రహస్యాలు చెప్పిన నాని.. అసలు అన్నా చెల్లెలు ఎందుకు విడిపోయారు? తల్లిని ఎందుకు వెళ్లగొట్టారు? సొంత చెల్లి కంటే అవినాష్‌రెడ్డి ఎందుకు ఎక్కువయ్యారు? అవినాష్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తే జగన్ ఎందుకు ఆగ్రహించారు? వంటి 'సెక్రెట్ రహస్యాలు' కూడా చెబితే బాగుండేది. బహుశా ప్రెస్‌మీట్‌లో పేర్ని వారి పాత్ర, దానికే పరిమితం చేసినట్లున్నారు మరి.

తాజాగా అసలు తన తండ్రి వైఎస్, తమకు ఏయే ఆస్తులు పంచారు అన్న అంశంపై వైఎస్ అభిమానులకు రాసిన లేఖలో షర్మిల స్పష్టత ఇచ్చారు. 'అవేమీ నీ సొంత ఆస్తులు కావు. నువ్వు కష్టపడి సంపాదించినవి కాదు. మా నాన్న సొమ్ము. వాటిని నువ్వు ఇచ్చేదేమిటి? నువ్వు జస్ట్ వాటికి గార్డియన్‌వి మాత్రమే'నని తేల్చిపారేశారు. షర్మిల తన తాజా లేఖలో ఆస్తులపై ఇంత స్పష్టత ఇచ్చిన తర్వాత కూడా జగన్, వాటికి సమాధానం ఇవ్వలేదంటే.. సింహం సిగ్గుపడినట్లే లెక్క అన్నది బుద్ధిజీవుల ఉవాచ.

అన్నాచెల్లెలు ప్రాపర్టీ ఎపిసోడ్ రోడ్డెక్కడంతో, మహిళాలోకంలో జగనన్న ఇమేజీకి భారీ డామేజీ జరుగుతోందని వైసీపీ పెద్దలు తల పట్టుకుంటున్నారు. "తల్లి-చెల్లిని గెంటేసి, వాళ్లకు ఇచ్చిన షేర్లు కూడా గుంజుకునే అన్నను, ఏ తల్లి, అక్కచెల్లెమ్మలు అభిమానిస్తారు? ఇది మా పార్టీకి భారీ డామేజీనే. అసలు షర్మిలపై పేర్ని నానితో మాట్లాడించడం ఏమిటి? జగన్ గారు మాట్లాడితేనే కన్విన్సింగ్‌గా ఉండేది. ఇది వాళ్ల ఫ్యామిలీ మ్యాటర్. ఏం జరిగిందో మాకేమీ తెలియదు కదా?

ఏదో ఇచ్చిన నోట్ మాట్లాటడమే తప్పు, మీడియా వాళ్లు ఏదైనా ప్రశ్నలు వేస్తే మేం ఏం సమాధానం చెప్పగలం? అసలు దీనిపై పార్టీ నేతలు కాకుండా నేరుగా జగన్ గారో, భారతమ్మ గారో మాట్లాడితేనే బాగుంటుంది. కనీసం భారతమ్మ పేరుతో ఒక నోట్ విడుదల చేసినా బాగుండేది. ఆ విషయం జగన్ గారికి చెప్పేవాళ్లెవరు?" అని ఓ మాజీ మంత్రి వాపోయారు.


### జగన్ ఆత్మలతో మాట్లాడతారా?

వైసీపీ అధినేత జగన్‌కు ఆత్మలతో మాట్లాడటం తెలుసా? కొంపతీసి కేరళకు వెళ్లి, అలాంటి మంత్ర తంత్రాలు నేర్చుకున్నారా? ఇప్పుడు ఈ చర్చ సోషల్‌మీడియాలో తెగ నడుస్తోంది. గతంలో నేను రాత్రి వేళల్లో నాన్నతో మాట్లాడతానని చె ప్పిన జగన్.. ఇప్పుడు రెండు నెలల క్రితం చనిపోయిన ఈనాడు అధినేత రామోజీరావు ఆత్మతో కూడా మాట్లాడుతున్నారా? అన్న ఇంకో కొత్త అనుమానం, ఆయన మాటలతో నిజమైంది. తాజా ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన జగన్.. 'అయ్యా ఈనాడు రామోజీరావు' అని సంబోధించడమే దానికి కారణం. ఎప్పుడో చనిపోయిన రామోజీని కూడా పిలుస్తున్నారేంటబ్బా? కొంపతీసి అన్నియ్య వాళ్ల నాన్నతో మాట్లాడినట్లే, రామోజీ ఆత్మతో మాట్లాడుతున్నారా ఏంటి" అని నెటిజన్లు సైటైర్లు విసురుతున్నారు.

***

ఒక వూళ్ళో ఒక దొంగ కుటుంబం ఊరివాళ్ళందరిని పిలిచి పంచాయితీ పెట్టింది. వాళ్ళు ఆ వూళ్ళో దోచుకొన్న సొమ్ము ఎలా పంచుకోవాలో చెప్పండి అని అడుగుతున్నారు. విచిత్రం ఏమిటంటే.. ఆ సొమ్ము పోగొట్టుకొన్న వాళ్ళందరూ వచ్చి, ఎవరెవరికి ఎంత న్యాయంగా రావాలో లెక్కలు కడుతున్నారు.

**కొసమెరుపు:** ఈ కథకు ప్రస్తుతం కోర్టుకెక్కిన పులివెందుల ఎపిసోడ్‌కూ సంబంధం ఉందా అని అడగకండి.




### ఒక తల్లి.. ఒక కొడుకు.. ఒక ట్వీట్

"తల్లి ప్రేమకు సమానమైనది ఏదీ లేదు. అమ్మ ఇచ్చే ప్రోత్సాహం, ధైర్యం, స్ఫూర్తి వెలకట్టలేనిది. ప్రేమ, త్యాగం, మూర్తీభవించిన మాతృమూర్తులందరికీ వందనాలు"
– ఇది మదర్స్‌డే రోజు, వైసీపీ అధినేత జగన్ చేసిన ట్వీట్.

అమ్మపై అంత ప్రేమానురాగాలు కురిపించిన జగనన్న.. ఇప్పుడు అదే అమ్మను కోర్టుకు ఈడ్చడం ఏంటని ఆశ్చర్యపోవడం సహజమే. ఆయన కోర్టు పిటిషన్ భాషలోనే చెప్పాలంటే.. అవును. ఇప్పుడు అమ్మపై ప్రేమానురాగాలు కరిగిపోయాయి మరి! స్టేట్‌మెంట్లు మార్చనివాడు పొలిటీషియనే కాదు పొమ్మన్న గిరీశం ఉపదేశం.. పులివెందుల బిడ్డకు బాగా వంటబట్టినట్లుందన్నది అక్కచెల్లెమ్మల ఉవాచ.

జనం గుండె చప్పుడు

# మహానాడు

03

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 26, అక్టోబర్ 2024

## మానవత్వం చాటుకున్న కేటీఆర్

◆ యాక్సిడెంట్ బాధితులను తన ఎస్కార్ట్ వాహనంలో హాస్పిటల్‌కు తరలింపు





హైదరాబాద్,మహానాడు:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. తన నియోజకవర్గం సిరిసిల్ల నుంచి హైదరాబాద్ కు వస్తుండగా మార్గమధ్యంలో సిరిసిల్ల నుంచి 15 కిలోమీటర్ల దూరంలో జిల్లెల్ల వద్ద జరిగిన యాక్సిడెంట్ ను గమనించారు. వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తులను తన ఎస్కార్ట్ వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఈ యాక్సిడెంట్‌లో ఇద్దరు వ్యక్తులకు తీవ్రంగా గాయాలు కావటంతో ఆయనే అంబులెన్స్ కు కాల్ చేశారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వారిని హాస్పిటల్ ను వేగంగా తరలించే ప్రయత్నం చేశారు. కేటీఆర్ చేసిన పనిని పలువురు ప్రశంసించారు.



## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల గెలుపునకు

# ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

◆ ఉమ్మడి తూర్పు గోదావరి-పశ్చిమ గోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనేతలతో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్

అమరావతి, మహానాడు:

జనసేన, భారతీయ జనతా పార్టీ(బీజేపీ)లతో సమన్వయం చేసుకుని ముందుకు వెళుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఉమ్మడి తూర్పు గోదావరి–పశ్చిమ గోదావరి, కృష్ణా–గుంటూరు జిల్లాల టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనేతలతో టీడీపీ అధినేత, సీఎం శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, మాట్లాడారు.

తూర్పుగోదావరి– పశ్చిమ గోదావరి పట్టభద్రుల ఎన్నికల అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్, గుంటూరు–కృష్ణా జిల్లాల అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను ఎన్డీయే తరపున ఇప్పటికే ప్రకటించాం. నాలుగు జిల్లాల్లోని నేతలందరి అభిప్రాయాలు తీసుకుని అభ్యర్థులను ప్రకటించాం. పట్టభద్రుల ఓట్ల నమోదుకు వచ్చే నెల ఆరో తేదీ చివరి రోజు. ఆ లోపు ఓటర్ల నమోదును పూర్తి చేయాలని సూచించారు. ఇంకా చంద్రబాబు ఏమన్నారంటే.. ప్రతి నియోజకవర్గంలో మూడు పార్టీల నేతలతో కో ఆర్డినేషన్ మీటింగ్ లు ఏర్పాటు చేసుకోవాలి. నియోజకవర్గాల వారీగా నమోదైన ఓటర్ల వివరాలను నేతలకు సీఎం వివరించారు. మూడు పార్టీలు కలిసి పని చేయడం వల్ల మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో 93 శాతం సీట్లు సాధించాం. రాష్ట్రాభివృద్ధి కోసం రేయింబవళ్ళు కష్టపడి పని చేస్తున్నాం. ఈ అంశాలు ప్రజల్లోకి వెళ్లాలి.

కేంద్ర కేబినెట్ అమరావతి రైల్వేలైనుకు ఆమోదం తెలిపింది. రూ.4,300 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనులు ప్రారంభించారు. ప్రభుత్వంలో ఉండి పనులు చేయడం ఎంత ముఖ్యమో...ఆ పనుల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం కూడా అంతే ముఖ్యం. నాలుగు నెలల్లో అమలు చేసిన పథకాలు, తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు వివరించాలి. ప్రజల కోసం తీసుకొచ్చిన పాలసీలు, పథకాలపై చర్చ జరగాలి. ప్రతి పట్టభద్రుడూ ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. ఇప్పటికే డీఎస్సీ ప్రకటించాం. ప్రైవేట్ రంగంలో పెట్టుబడులను తీసుకొచ్చేందుకు ఆరు పాలసీలు తీసుకొచ్చాం. నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని జాబ్ ఫస్ట్ విధానంతో ఉద్యోగ కల్పనకు ప్రయత్నిస్తున్నాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు అడుగు ముందుకేస్తున్నాం. ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నాం.

ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ఉండి ఓట్లు నమోదు చేయించాలి. విజయవాడ వరద బాధితులకు ఎప్పుడూ లేని విధంగా దెబ్బతిన్న ఒక్కో ఇంటికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించాం. ఎవరూ ఊహించనిస్థాయిలో సాయం అందించాం. నామినేటెడ్ పోస్టుల భర్తీపైనా చర్చిస్తున్నాం. అందరం కలిసి కట్టుగా పనిచేసి శాశ్వతంగా ఎన్డీయే గెలిచేలా చూడాలి. దేశం, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేయాలి. పొలిటికల్ గవర్నెన్స్‌లో భాగంగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మండలాల వారీగా ఎన్డీయే కో–ఆర్డినేషన్ కమిటీలు ఏర్పాటు చేసుకొని ముందుకెళ్లాలి. పని చేయాల్సింది ఇప్పటి కోసమే కాదు. 2029లోనూ మళ్లీ ఎన్డీయే గెలుపే లక్ష్యంగా పనిచేయాలి...రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలబెట్టాలి. విజన్ 2047 డాక్యుమెంట్ ను ప్రధాని మోదీ ఆవిష్కరిస్తారు. రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో మంచి మెజారిటీతో కూటమి అభ్యర్థులు గెలిచేలా నేతలు నియోజకవర్గాల్లో పని చేయాలి.

# అవును.. అది నా అబ్బ సొమ్ము

మొదటి పేజీ తరువాయి..

వైఎస్ షర్మిలా రెడ్డి
ఏపీసీసీ చీఫ్

ఈరోజు పొద్దున సాక్షి పేపర్ చూశాను. సాక్షి మీడియా జగన్ మోహన్ రెడ్డి గారి చేతిలో ఉంది. కాబట్టి ఏదైనా నమ్మించ గలడు. అయినా వైఎస్ అభిమానులకు అసలు వాస్తవాలు తెలియజేసే ప్రయత్నం నాది.

అమ్మ వైఎస్ విజయమ్మ గారు, నాన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి గురించి ఒక పుస్తకం రాశారు. అందులో నాన్న గురించి ప్రత్యేకంగా ఒక మాట రాశారు. "రాజశేఖర్ రెడ్డి గారికి లోకం అంతా ఒకెత్తయితే", తన బిడ్డ షర్మిల ఒకెత్తు అని రాశారు. నాన్నకు నేనంటే ప్రాణం. నాన్న నన్ను ఎప్పుడూ ఆడపిల్ల కదా అని చిన్న చేసో, తక్కువ చేసో చూడలేదు.

నాన్న బ్రతికి ఉన్నన్ని రోజులు ఒకే మాట అనేవారు. "నా నలుగురు గ్రాండ్ చిల్డ్రన్ నాకు సమానం". వైఎస్ఆర్ గారు బ్రతికి ఉండగా స్థాపించిన అన్ని కుటుంబ వ్యాపారాల్లో, నలుగురు గ్రాండ్ చిల్డ్రన్ కి సమాన వాటా ఉండాలి. రాజశేఖర్ రెడ్డి గారు ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాలు కుటుంబ వ్యాపారాలే. అవి జగన్ మోహన్ రెడ్డి గారి సొంతం కాదు.

ఉన్న అన్ని కుటుంబ వ్యాపారాలకు జగన్ గారు "గార్డియన్ " మాత్రమే. అన్నీ వ్యాపారాలు నలుగురు చిన్న బిడ్డలకు సమానంగా పంచి పెట్టలనేది జగన్ మోహన్ రెడ్డి గారి భాధ్యత. ఇది రాజశేఖర్ రెడ్డి గారి మేండేట్. వైఎస్ఆర్ ఈ ఉద్దేశ్యాన్ని ఆయన బిడ్డలమైన మాకు, ఆయన భార్యకు, సన్నిహితులందరికి, స్పష్టంగా తెలిసిన విషయం. (Including: కేవీపీ రామచందర రావు గారు, వైవి సుబ్బారెడ్డి గారు, విజయసాయి రెడ్డి గారు ).

నాన్న బ్రతికి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాల్లో, సరస్వతి అయినా...భారతి సిమెంట్స్ అయినా... సాక్షి మీడియా, క్లాసిక్ రియాలిటీ, యలహంక ప్రాపర్టీ, ఇలాంటివి ఏమైనా... నలుగురి బిడ్డలకు సమాన వాటా ఉండాలి అన్నది వైఎస్ఆర్ మాండేట్. ( ఒక్క సండూరు మినహాయించి ). రాజశేఖర్ రెడ్డి గారు బ్రతికి ఉన్నంత వరకు ఏ ఒక్క ఆస్తి పంపకం కూడా జరగలేదు. వైఎస్ఆర్ హఠాత్తుగా మరణించారు. ఆ తర్వాత కూడా ఏ ఆస్తి పంపకాలు జరగలేదు. ఈ రోజు వరకు నాకు న్యాయంగా రావాల్సిన ఒక్క ఆస్తి కూడా నా చేతుల్లో లేదు.

స్వార్జితం అని జగన్ మోహన్ రెడ్డి గారు చెప్పుకుంటున్న ఆస్తులు అన్ని కుటుంబ ఆస్తులే. రాజశేఖర్ రెడ్డి గారు బ్రతికి ఉన్నప్పుడే ఆస్తులు పంపిణీ చేశారనేది అవాస్తవం. ఈరోజు సాక్షిలో చూపినట్లుగా మా తాతల ఆస్తి చిన్నప్పుడే నా పేరు మీద పెట్టినంత మాత్రాన, అది నాన్న నాకు పంచిన ఆస్తి కాదు.. ఇతరులతో ఒక వ్యాపారంలో చిన్న భాగం నా పేరు మీద పెడితే అది ఆస్తి పంచి ఇచ్చినట్లు కాదు. ఆస్తి పంచడం అంటే .. ఇవిగో ఈ ఆస్తులు నీకు, ఇక ఇంతే అని మా నాన్న నాకు చెప్పి ఉంటే అది ఆస్తి పంచేయడమంటే.

నేను జగన్‌మోహన్ రెడ్డిగారి ఆస్తుల్లో వాటా అడుగుతున్నాననేది హాస్యాస్పదం. ఇవన్నీ కుటుంబ ఆస్తులు కనుక రాజశేఖర్ రెడ్డి నలుగురు చిన్న బిడ్డలకు సమానంగా పంచాలి అనుకున్నారు.

కాబట్టే.. ఈరోజు వరకు వీటి గురించి మాట్లాడు తున్నాం. నాకంటూ వ్యక్తిగతంగా ఈ ఆస్తులపై మోజు లేదు.

వీళ్ళు పెట్టిన హింసలకు ఈ ఆస్తులు కావాలని కోరిక కూడా లేదు. కేవలం నా బిడ్డలకు ఈ ఆస్తులు చెందాలి అనేది రాజశేఖర్ రెడ్డి గారి అభిమతం గనుక,ఈ రోజు వరకు కూడా అమ్మైనా, నేనైనా తపన పడుతున్నాం. ఇప్పటికీ అమ్మ వెయ్యి సార్లు వీళ్ళను అడిగి ఉంటుంది. వందల కొద్దీ లేఖలు రాసి ఉంటుంది. అయినా నా బిడ్డలకు చెందాల్సిన ఆస్తుల్లో ఒక్కటి కూడా ఇవ్వలేదు.

రాజశేఖర్ రెడ్డి గారు చనిపోయిన తర్వాత..10 ఏళ్లు జగన్ గారు ఇబ్బందులు పడితే, అవి నా ఇబ్బందులు అనుకొని..నా శక్తికి మించిన సహాయం చేశాను. తోడబుట్టిన వాడికోసం నా బిడ్డలను సైతం పక్కనపెట్టి ఆయన్ను, ఆయన పార్టీని ఏ స్వార్థం లేకుండా నా భుజాల మీద మోశాను. ఆ 10 ఏళ్లు నా అవసరం ఉంది అనుకున్నారో, ఏమో.. నన్ను బాగానే చూశారు. పెద్ద కూతురు అన్నారు.

ఆ 10 ఏళ్లు రాజశేఖర్ రెడ్డి గారు ఊహించినట్లుగానే.. గ్రాండ్ చిల్డ్రన్‌నలుగురు సమానం అన్నట్లుగానే వ్యవహరించారు. ఆ 10 ఏళ్లలో 200 కోట్లు ఇచ్చామని చెప్తున్నది ఇందులో భాగంగానే. ఆ 10 ఏళ్లు నా బిడ్డలకు సమాన వాటా ఉందని గుర్తిస్తూ.. కంపెనీల్లోనీ డివిడెండ్ లో సగం వాటా నాకు ఇవ్వడమే ఈ 200 కోట్లు. వాళ్ళు చేసింది ఉపకారం కాదు. ప్రేమతో ఇచ్చింది అంతకంటే కాదు. నాకు సమాన వాటా ఉంది కాబట్టి డివిడెండ్ లో సగం వాటా ఇవ్వడం జరిగింది. అది కూడా అప్పుగా చూపించమన్నారు.

2019లో జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. సీఎం అయిన వెంటనే జగన్ గారు గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. చిన్నచూపు చూడటమే కాకుండా సీఎం అయిన నెలరోజులకే విడిపోదాం అని ఇజ్రాయిల్ పర్యటనలో ప్రతిపాదన పెట్టారు. ఇందుకు అమ్మా, నేను వద్దు అని చెప్పాం. లేదు ససేమిరా విడిపోవాల్సిందే అని పట్టుబట్టాడు. తర్వాత రోజుల్లో ఆస్తులు పంచుకుందామని విజయవాడకు రమ్మన్నారు.

విజయవాడకు వచ్చాక, భారతి సిమెంట్స్, సాక్షిలో నాకు ఎక్కువ వాటా కావాలని అడిగాడు. నేను 60 తీసుకుంటా, నీకు 40 ఇస్తా అని చెప్పాడు. అది అమ్మకు కూడా భావ్యం అనిపించలేదు. సగం కంటే ఎక్కువ కావాలని గట్టిగా అనుకుంటే 5 శాతం ఎక్కువ తీసుకో.. లేదా 10 శాతం ఎక్కువ తీసుకో.. కానీ 20 శాతం ఎక్కువ కావాలని అడగడమంటే అన్యాయం అని పిస్తుంది అని అమ్మ చెప్పింది. అయినా ఇంతే అని బుల్డోజ్ చేశారు.

తర్వాత అర్ధగంటలో ఈ ఆస్తులు నీకు, ఈ ఆస్తులు నాకు అని తేలిపోయింది. దీని ప్రకారం సాక్షిలో 40 శాతం, భారతి సిమెంట్స్ లో వాళ్లకు చెందిన 49 శాతంలో 40 శాతం, సరస్వతి పవర్ లో 100 శాతం, యలహంక ప్రాపర్టీలో 100 శాతం, వైఎస్ఆర్ నివాసమున్న ఇల్లు, ఇంకా కొన్ని ఆస్తులు నా భాగానికి రావడం జరిగింది.

ఆ కొద్దీ వారాల్లోనే ఎంఓయు తయారయ్యింది. అంతకు ముందు మాట్లాడుకున్న దాని ప్రకారం సరస్వతి సిమెంట్స్ షేర్స్, యలహంక ప్రాపర్టీ అటాచ్ కాలేదు కాబట్టి... అది వెంటనే రాసిస్తామని, మిగతా ఆస్తులు కేసుల వ్యవహారం పూర్తి అయిన తర్వాత బదిలీ చేస్తామని, ఒప్పందం జరిగి సంతకాలు పెట్టాం. నా వాటా నాకు ఇస్తున్నాడు తప్పితే ప్రేమ అభిమానాలతో కాదనేది వాస్తవమైనా, జగన్ మోహన్ రెడ్డి గారిది పైచేయిగా ఉన్నది కాబట్టి.. వాళ్ళు రాసినదానిపై అమ్మ నన్ను సంతకం పెట్టమని కోరింది. కేసుల్లో లేని సరస్వతి, యలహంక ప్రాపర్టీలను, ఎంఓయు మీద సంతకం పెట్టిన 2019 లోనే ఇవ్వాల్సి ఉండగా.. ఈ రోజు వరకు ఇవ్వాలన్న ఉద్దేశ్యం వాళ్లకు లేదు. అమ్మ గట్టి ఒత్తిడి మేరకు, క్లాసిక్, సండూరు హోల్డ్ చేస్తున్న 52 శాతం సరస్వతి షేర్స్ నీ 2021 లో కొనుక్కోవడానికి అంగీకరించారు. ఇక తర్వాత రోజుల్లో వాళ్ళ ఇండివిద్యువల్ షేర్లు కూడా అమ్మకు గిఫ్ట్ ఇవ్వడం జరిగింది.

అదే 2021లో, నేను రాజకీయాల్లో అడుగుపెట్టడం, మొదట తెలంగాణలో, ఆ తర్వాత కాలంలో ఆంధ్రకు రావడం జరిగింది. తనకు ఇష్టం లేకుండా రాజకీయాల్లోకి వచ్చానని, నన్ను తొక్కడానికి జగన్ మోహన్ రెడ్డి గారు చెయ్యని ప్రయత్నం లేదు. ఆంధ్రలో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం చేస్తే, నన్ను అన్ని రకాలుగా అవమానించడమే కాకుండా, సోషల్ మీడియాలో ఉచ్ఛం, నీచం లేకుండా, పెళ్లి అయ్యి పిల్లలు ఉన్న దాన్ని అనే ఇంగితం కూడా లేకుండా, వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు.

నన్నే కాదు, వైఎస్ఆర్ తమ్ముడు వివేకానంద రెడ్డి పర్సనల్ ఫోటోలు సాక్షి మీడియాలో అసభ్యకరంగా ప్రచురించి అతి దారుణంగా వ్యవహరించారు.

ఆంధ్ర ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డి గారు ఓడిపోయాక.. ఆ ఓటమికి నేను కారణం అని వాళ్ళు బలంగా నమ్మారు. కాబట్టి మాకు విరోధం వద్దని, సెటిల్ చేసుకుందామని, బంధువులను నా దగ్గరకు పంపించడం జరిగింది.

మాకు విరోధం వద్దు అంటూనే.. సెటిల్మెంట్ చేసుకోవడానికి ఒక కండీషన్ పెట్టారు. నేను జగన్ మోహన్ రెడ్డి గారి మీద, భారతి రెడ్డి గారి మీద, అవినాష్ రెడ్డి గారి మీద వ్యతిరేకంగా పబ్లిక్ ఫ్లాట్ ఫాంలో మాట్లాడకూడదనేది ఆ కండిషన్ సారాంశం. ఆ కండిషన్ నా వృత్తి ధర్మానికి వ్యతిరేకం కాబట్టి నాకు సమ్మతం అనిపించలేదు. బంధువులు ఎంత ఒత్తిడి చేసినా నేను ఒప్పుకోలేదు. నేను ఒప్పుకోలేదు కాబట్టే సెటిల్ మెంట్ జరగలేదు.

సెటిల్ మెంట్ కి ఒప్పుకోలేదని మళ్ళీ కక్ష్య కట్టి, నా మీద, అమ్మ మీద ఎన్‌సీఎల్‌టీలో మేము మోసం చేసి షేర్లు తీసుకున్నామని కేసు వేశారు. పబ్లిక్ లో గత కొన్ని రోజులుగా అమ్మ మీద కేసు వేసిన దుర్మార్గుడు అనే అపకీర్తి ఇప్పుడు వస్తుందని గమనించి.. నా బెయిల్ రద్దుకు కుట్ర చేస్తున్నారనే అభియోగం మోపుతున్నారు.

నిజానికి బెయిల్ రద్దు అయ్యే సీన్ లేదు. ఎందుకంటే సరస్వతి షేర్స్ అటాచ్ అవ్వలేదు. కంపెనీల్లో ED అటాచ్ చేసింది షేర్లు కాదు. 32 కోట్లు విలువ జేసే భూములు మాత్రమే. షేర్స్ ట్రాన్స్ఫర్‌కి, ఆయన బెయిల్ రద్దుకి ఎటువంటి సంబంధం లేదు.

నిజానికి ఎన్‌సీఎల్‌టీలో జగన్ మోహన్ రెడ్డి వేసిన కేసు అమ్మ మీద కాబట్టి, ఈ విషయం బయటకు వస్తే, వైఎస్ కుటుంబం అప్రతిష్టపాలయితే, యావత్ ప్రపంచం నాలుగు రకాలుగా మాట్లాడితే, అమ్మ ఎంతగానో క్షోభపడుతుందని, ఇది మాలో మేమే విషాన్ని గొంతులో దాచుకున్నట్టు దాచుకున్నాము. ఒక కుమారుడు తన తల్లికి తీసుకురాకూడని పరిస్థితి ఇది.

విలువలు, కుటుంబం కోసం పాటుపడే రాజశేఖర రెడ్డి గారి కుమారుడే సొంత తల్లిని కోర్టుకి ఈడ్చడం, ఆ తల్లికి ఎంత అవమానం.? అందుకే స్వర్గంలో క్షోభిస్తున్న నాన్న కోసం, నా పక్కనే నిలబడి మాటల్లేని వేదన నిండిన మా అమ్మను మరింత బాధపెట్టకూడదని, అన్యాయంగా మాపై కేసు వేసిన సంగతి మేము ఎక్కడా బయట పెట్టలేదు. బయట పడకుండా ఉండటానికి ప్రయత్నం చేశాం.

కానీ కేసు వేసిన నెల రోజులకు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీని వెనుక జగన్ మోహన్ రెడ్డి గారు కారణం అని ఎందుకు అనుకోకూడదు? దుర్మార్గంగా తల్లిని కోర్టుకు ఈడ్చిన జగన్ మోహన్ రెడ్డి గారికి, మమ్మల్ని మోసం చేసిన వాళ్ళుగా చిత్రీకరించడంలోనే ప్రయోజనం ఉంది కదా?

నేను జగన్ గారికి ఒక లెటర్ రాస్తే.. అది టీడీపీ హ్యాండిల్ లో పోస్ట్ అయితే నాకు ఏం సంబంధం? నేనైతే బైబిల్ మీద ప్రమాణం చేయగలను. నా వరకు నేను గాని, నా మనుషులు గాని బయట పెట్టలేదని ప్రమాణం చేయగలం. చంద్రబాబు చేతిలో బాణం కావాల్సిన అవసరం వైఎస్ బిడ్డకు లేదు. జగన్ మోహన్ రెడ్డి గారు ఎవరి కొంగు చాటున ఉండి, ఆస్తి, అధికారం కోసం ఇదంతా చేస్తున్నారో రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారు.

అమ్మ, నేను మోసం చేస్తున్నామని గాని, లేక ఆస్తికోసం అత్యాశ పడుతున్నామని గాని, వైఎస్ అభిమానులు భావించ కూడదని.. పైనున్న వాస్తవాలు అన్ని మీ ముందు పెట్టడం జరుగుతుంది. ఒక విషయం గుర్తుచేస్తున్నా.. ఎంఓయు నా చేతుల్లో 5 ఏళ్లు ఉన్నా...దాంట్లో నాకు ఒక్క ఆస్తి కూడా ఇవ్వకపోయినా... ఏ ఒక్క మీడియా కి కానీ, కోర్టుకి కానీ, ఈ ఎంఓయు నాకు నేనుగా బయటపెట్టలేదు.

అవకాశం, అవసరం ఉన్నా...ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు పడినా.. కుటుంబ గౌరవం, వైఎస్ పరువు కోసం నేను ఎక్కడా 5 ఏళ్ళు ఎంఓయు బయట పెట్టలేదు. నాలుగు గోడల మధ్య ఉండాల్సిన ఎంఓయు ఈరోజు బయటకు వచ్చిందన్నా.. పరస్పరం రాసుకున్న లెటర్లు బయటకు వచ్చాయన్నా.. ఎన్‌సీఎల్‌టీలో తల్లి మీద కేసు వేసి సొంత అమ్మకే బ్రతుకు మీద అసహ్యం కలిగించి, వైఎస్ అభిమానులను ఎనలేని మానసిక క్షోభకు గురిచేసింది ఎవరో మీకు తెలుసు.

కుటుంబ బంధం, స్నేహ బంధంతో మనుషులు ఒక్కటవుతారు. కానీ ఆంధ్ర రాష్ట్రంలో "వైఎస్ బంధం" ఏర్పరుచుకున్న ప్రతి వైఎస్ బంధువుకి ఈ వివరణ ఇస్తున్నాను.

వైఎస్ అభిమానులు,అమ్మను నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దని, వాస్తవాలను తెలియ పరుస్తూ...

**మీ రాజశేఖర్ రెడ్డి బిడ్డ**

**- వైఎస్ షర్మిలా రెడ్డి**

## పర్యాటకులకు శుభవార్త..

# అధ్యాత్మిక యాత్రకు శ్రీకారం

◆ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వారాంతంలో ప్రముఖ అధ్యాత్మిక దేవాలయాలు, పంచారామ క్షేత్రాలు సందర్శించేలా ఒక రోజు టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేశామని వెల్లడించిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్

◆ అసెంబ్లీలో శాసనసభ్యుల సూచనల మేరకు ప్రణాళిక సిద్ధం చేశామని పేర్కొన్న మంత్రి కందుల దుర్గేష్

◆ భక్తులకు అధ్యాత్మిక సాంత్వనను అందించేందుకు 6 పుణ్య క్షేత్రాలతో అధ్యాత్మిక యాత్రను పర్యాటకులకు అందిస్తున్నామన్న మంత్రి

◆ కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామం, వాడపల్లి ఆలయాలను కలుపుతూ ప్రతి శనివారం అందుబాటులో బస్సులు.. పర్యాటకుల రద్దీ, డిమాండ్ దృష్ట్యా ఆదివారం కూడా బస్సులు

◆ రాజమహేంద్రవరం సరస్వతీ ఘాట్ వద్ద టూరిజం శాఖకు సంబంధించిన ఇన్ఫర్మేషన్ అండ్ రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం (ఐఆర్ఓ) వద్ద ఉదయం 6 గం.లకు బస్సులు ప్రారంభం.. రాత్రి 7.30 కి ముగియనున్న ప్రయాణం

◆ మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, టూరిజం శాఖ ఉన్నతాధికారులు, బోర్డ్ డైరెక్టర్ల చేతుల మీదుగా నేటి నుండే బస్సులు ప్రారంభం

◆ పెద్దలకు రూ.1,000, 3-10 ఏళ్ల వయస్సు గల చిన్నారులకు రూ. 800 టికెట్.. ప్రకృతి రమణీయత, అధ్యాత్మిక కలయికగా ఉన్న టూర్ ప్యాకేజీని యాత్రికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరిన మంత్రి దుర్గేష్

◆ యాత్రికులకు సౌలభ్యంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్న మంత్రి కందుల దుర్గేష్

అమరావతి,మహానాడు:

యాత్రికుల హృదయాలకు, మనస్సులకు అధ్యాత్మిక సాంత్వనను అందించేందుకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒక రోజు అధ్యాత్మిక ప్రయాణ పర్యాటక ప్యాకేజీని నేటి నుండి (అక్టోబర్ 26) ప్రారంభించబోతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసనసభలో పలువురు ఎమ్మెల్యేల సూచనల మేరకు వారాంతంలో ఉమ్మడి తూర్పుగోదావరిలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలు, పంచారామ క్షేత్రాలను కలిపేలా ఒక రోజు టూర్ ప్యాకేజీని ప్రవేశపెట్టామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

ప్రారంభోత్సవంలో తనతో పాటు ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, టూరిజం శాఖ ఉన్నతాధికారులు, బోర్డ్ డైరెక్టర్ల చేతుల మీదుగా బస్సులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ టూర్ ప్యాకేజీ వివరాలను వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. పర్యాటకానికి ముఖద్వారమైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలుత అత్యంత ప్రసిద్ధి చెందిన పురాతన క్షేత్రమైన కోరుకొండ స్వయం భూ శ్రీ లక్ష్మీ నర్సింహాస్వామి దేవస్థానం దర్శించిన అనంతరం రత్నగిరి కొండపై వెలసి భక్తుల కోరికలు తీరుస్తూ కొంగు బంగారంగా నిలిచిన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయ దర్శనం, ఆ తర్వాత పితృముక్తి క్షేత్రంగా, పాదగయ తీర్థంగా పేరొందిన పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వరస్వామి ఆలయం దర్శించిన పిమ్మట విశాలమైన ప్రాకారాలతో, చాళక్యుల శిల్పకళా నైపుణ్యంతో అలరారుతూ పంచారామ క్షేత్రాల్లో ఒకటైన సామర్లకోటలోని శ్రీ చాళుక్య కుమారరామ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయాన్ని యాత్రికులు దర్శించుకొంటారని తెలిపారు.

సామర్లకోట దేవాలయంలో మధ్యాహ్నం అన్న ప్రసాదాలు స్వీకరించిన అనంతరం అత్యంత ప్రాచీన మహిమాన్విత శివ లింగ క్షేత్రం ద్రాక్షారామంలోని భీమేశ్వరస్వామి ఆలయాన్ని యాత్రికులు సందర్శిస్తారని తెలిపారు. ఆ తర్వాత కోనసీమ తిరుపతిగా, ఏడు శనివారాల వెంకన్న దేవుడిగా భక్తులచే కీర్తి పొంది విశేషంగా ఆకట్టుకుంటున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని యాత్రికులు సందర్శించేలా ఒక రోజు టూర్ ప్యాకేజీని నిర్ణయించామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. అక్టోబర్ 26 నుండి బస్సులు పర్యాటకులకు అందుబాటులోకి రానున్నాయని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.




రాజమహేంద్రవరంలోని సరస్వతి ఘాట్ వద్ద పర్యాటక శాఖకు సంబంధించిన సమాచార మరియు రిజర్వేషన్ కేంద్రం వద్ద ప్రతి శనివారం ఉదయం 6 గంటలకు బయలుదేరే పర్యాటకుల బస్సు కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామం, వాడపల్లి ఆలయాల మీదుగా రాత్రి 7.00 గంటలకు రాజమహేంద్రవరంలోని హేవలాక్ బ్రిడ్జి దగ్గర పుష్కర్ ఘాట్ కు చేరుకుంటుందన్నారు.

అక్కడే పవిత్ర గోదావరి నదికి కన్నుల పండువగా హారతి ఇచ్చే ప్రాంతంలో మంత్ర ముగ్ధ దృశ్యాలను భక్తులు తిలకించేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు. భక్తులు అధ్యాత్మిక ప్రపంచంలో మునిగి తేలేలా కార్యక్రమం పూర్తయిన అనంతరం 7.30 గంటలకు తిరిగి రాజమహేంద్రవరంలోని ఏపీటీడీసీకి చెందిన ఇన్ఫర్మేషన్ అండ్ రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం వద్దకు భక్తులను చేరవేస్తామన్నారు. ఇంతటితో యాత్ర సమాప్తమవుతుందన్నారు. వివరాలకు యాత్రికులు ఐఆర్ఓను సంప్రదించాలని తెలిపారు.

18 మంది సీటింగ్ సామర్థ్యంతో బయలుదేరే బస్సు ఆద్యంతం ప్రకృతి రమణీయత దృశ్యాల నడుమ ప్రయాణించేలా ప్రణాళిక రూపొందించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెడుతున్న ఈ అధ్యాత్మిక యాత్ర భక్తులకు మానసికోల్లాసాన్ని కలిగించి అధ్యాత్మిక భావనను పెంచుతుందని భావిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అభిప్రాయపడ్డారు.

ఈ మేరకు పర్యాటక శాఖ సన్నాహాలు చేస్తుందని వెల్లడించారు. భక్తుల కోరిక మేరకు 18 మంది సమూహంతో పర్యాటక శాఖను సంప్రదిస్తే ప్రయాణం ఏర్పాటు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పెద్దలకు రూ.1000, 3–10 ఏళ్లలోపు చిన్నారులకు రూ.800 టూర్ ఛార్జీగా నిర్ణయించామన్నారు. ప్రకృతి రమణీయత, అధ్యాత్మిక కలయికతో కూడిన టూర్ ప్యాకేజీని యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ కోరారు.

అధ్యాత్మిక భావంతో పాటు సాంస్కృతిక, చారిత్రాత్మిక ప్రదేశాలకు మరింత వెలుగులు అద్దడమే టూర్ ప్యాకేజీ ముఖ్యోద్దేశమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 26, అక్టోబర్ 2024 ||




సీఎం చంద్రబాబు నాయుడు హడ్కో ఛైర్మన్ సంజయ్ కుల్ శ్రేష్ఠ శుక్రవారం భేటీ అయ్యారు. అమరావతి నిర్మాణానికి రూ.11 వేల కోట్ల ఆర్థిక సాయాన్ని హడ్కో అందించాలని సీఎం కోరారు. అలాగే, అమరావతిలో పది ఎకరాల్లో ఇంటర్ నేషనల్ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి హడ్కో ఆసక్తి కనబరచింది. ఈ మేరకు సీఎం ఎక్స్ వేదికగా వెల్లడించారు.



# బీసీ పథకాలకు నిధుల కొరత రానివ్వం

- మంత్రి ఎస్.సవిత

**అమరావతి,మహానాడు:** బీసీ అభ్యున్నతికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని,వెనుకబడిన తరగతుల సంక్షేమ పథకాలకు నిధుల కొరత రానివ్వబోమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు.

అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్ లో ఉన్న తన కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖాధికారులతో శుక్రవారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏయే పథకాలు అమలవుతున్నాయి...వాటి పురోగతి ఏ స్థాయిలో ఉందో..? అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులపైనా ఆరా తీశారు. బీసీ భవనాలు, కాపు భవనాల ప్రగతితో పాటు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలపైనా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీల అభివృద్ధి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో బీసీలకు అభ్యున్నతికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చనున్నామన్నారు. బీసీ సంక్షేమ శాఖలో అమలు చేసే పథకాలను నిధులు కొరత రానివ్వ బోమని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బీసీ ఏ కులాల్లోని సంచార జాతుల కోసం చేపట్టబోయే పథకాలు గురించి అడిగి తెలుసున్నారు. సీడ్ పథ కంతో సంచార జాతులకు ఎంతో మేలుకలుగుతుందన్నారు. ఈపథకంపై బీసీ ఏలో అవగాహ కల్పించాలన్నారు. బీసీ హాస్టళ్లలో డైట్ బిల్లు కొంత మేర చెల్లించాలని, మిగిలిన బకాయిలను త్వరలోనే చెల్లిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.



### 26 జిల్లాల్లోనూ డీఎస్సీ కోచింగ్ సెంటర్లు...

ఉద్యోగాల కల్పనలో బీసీ యువతకు వెన్నుదన్నుగా నిలిచే బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా కోచింగ్ నిర్వహిస్తున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. త్వరలో జరగబోయే డీఎస్సీ పరీక్షకు సంబంధించి, 26 జిల్లా కేంద్రాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయలేదని, త్వరితగతిన ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా అన్ని ప్రవేశ పరీక్షలకు కోచింగ్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. నోటిఫికేషన్లు వచ్చినప్పుడు మాత్రమే కోచింగ్ సెంటర్లు నిర్వహించకుండా, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ఆయా ఉద్యోగాలు, క్యాడర్‌ను బట్టి బీసీ యువతకు కోచింగ్ ఇచ్చే ఆలోచన ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పనలో బీసీ యువతకు సీఎం చంద్రబాబునాయుడు వెన్నుదన్నుగా ఉంటున్నారన్నారు.

### కేంద్ర పథకాలకు నిధుల కొరత రానివ్వం

గత జగన్ పాలన రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించకపోవడం వల్ల ఎన్నో కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోలేకపోయామని మంత్రి సవిత తెలిపారు. రాబోయే 5 ఏళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వమిచ్చే అన్ని పథకాలనూ వినియోగించుకోడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏయే కేంద్ర ప్రభుత్వాలకు ఎంతమేర రాష్ట్ర వాటా చెల్లించాలో చెబితే, ఇవ్వడానికి సీఎం చంద్రబాబునాయుడు సిద్ధంగా ఉన్నారన్నారు.

బీసీలకు మేలు కలిగే పథకాలకు నిధులు కొరత రానివ్వబోమని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్, డైరెక్టర్ మల్లికార్జున, గురుకులాల కార్యదర్శి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



# 27న అఖిల భారత యాదవ మహాసభ

**గుంటూరు, మహానాడు:** అరండల్ పేటలోని వైన్స్ డీలర్ కల్యాణ మండపం 2/4 వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు అఖిల భారత యాదవ మహాసభ గుంటూరు జోనల్ సభ నిర్వహించనున్నట్టు మహాసభ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నాగ మల్లేశ్వరి యాదవ్ తెలిపారు. గుంటూరు జోనల్ లో ఉన్న యాదవులను ఐక్యత పరిచి అభివృద్ధి పథంలో నడపడమే అఖిల భారత యాదవ మహాసభ ముఖ్య లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. విద్య ఉపాధి రాజకీయ అన్ని రంగాల్లో కూడా యాదవులను ముందుకు నడవాలని, రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న యాదవులు రాజ్యాధికారలో కూడా ప్రధాన భూమిక పోషించే విధంగా అఖిల భారత యాదవ మహాసభ చైతన్య పరుస్తుందని తెలిపారు.

# 28న శావల్యాపురంలో 'ప్రజాదర్బార్'

- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వెల్లడి

**వినుకొండ, మహానాడు:** స్థానిక ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 28వ తేదీన శావల్యా పురం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్టు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వెల్లడించారు. ఎక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారం లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టబోతున్నామన్నారు. వారానికి ఒక మండలంలో నేరుగా ఎమ్మెల్యేనే వచ్చి సమస్యలు వింటారని గతంలో ఇచ్చిన హామీ మేరకు తానే స్వయంగా ఈ ప్రజాదర్బార్‌కు హాజరు కానున్నట్టు శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి వారం వారం ఈ కార్యక్రమం క్రమం తప్పకుండా నిర్వహిస్తామన్నారు. ప్రతి సోమవారం ఒక్కొక్క మండల కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అధికారులు అందరితో కలిసి ఉండి సమస్యలకు పరిష్కారాలు చూపిస్తామన్నారు.





# సీఆర్ జెడ్‌ను లెక్క చేసేదిలే

- తాహసీల్దార్ వార్నింగ్.. వార్నింగే
- ఎస్ఐకు భయపడం
- ఇదీ మోపిదేవి శాండ్ మాఫియా తీరు తెన్నూ
- కలెక్టర్ బాలాజీని అలెర్ట్ చేయండి
- అవనిగడ్డ నియోజకవర్గంలో ఇసుకాసుర స్వైర విహారం

**(బహదూర్)**

గాంధేయవాది.. హింసకు అతిదూరం. ప్రశాంతతే ఆయన నైజం. కానీ.. ఆయన ఇలాఖాలో అదే అవనిగడ్డ నియోజకవర్గంలో.. ఇసుకాసుర స్వైర విహారం అనితరం. అనన్యసామాన్యం. ఒక వైపు ఇలాంటి పనులు వద్దని ఆ నేత మొత్తుకున్నా.. ఇసుక రక్కసులు బేఖాతరు చేస్తున్నారు. ఇక రెవెన్యూ, పోలీసు అధికారులు హెచ్చరించినా.. అసలు తగ్గేదే లేదంటూ ఇసుక తవ్వేస్తున్నారు. మరీ ముఖ్యంగా మోపిదేవి మండలంలో శాండ్ మాఫియా చెలరేగిపోతోంది.

కృష్ణానదిలో ఇసుకను తోడేసి పడవల్లో తరలిస్తోంది. వందల కొద్దీ ట్రాక్టర్లను రంగంలోకి దించి నోట్ల కుంభవృష్టిలో చిందులేస్తోంది.

# పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్

- రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్‌గా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- ఆయన రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవ్వడంతో రాష్ట్రంలో ఆస్తుల విలువలు గణనీయంగా పెరిగాయి
- రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో ఆరు నూతన పాలసీలు
- అమరావతి, పోలవరం, రైల్వే, జాతీయ రహదారుల అభివృద్ధి పనులతో సామాజిక ఆర్థికాభివృద్ధితో పాటు భవిష్యత్తు ఉజ్వలం
- రాష్ట్రంలో ఏ ఒక్క నిరుపేద నాకు ఇల్లు లేదనే మాటకు అవకాశం లేకుండా 2029 కల్లా పేదలందరికీ శాశ్వత గృహాలు
- గృహ నిర్మాణ, సమాచార పౌర సంబధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

**అమరావతి,మహానాడు:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్రాండ్ ఇమేజ్ తో పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ మారిందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు.

దాదాపు రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశలు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఆరు నూతన పాలసీల నేపథ్యంలో దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలు అంతా ఆంధ్రప్రదేశ్ వైపుకు చూస్తు న్నారన్నారు. పరిశ్రమలు, ఎం.ఎస్.ఎం.ఇ. ఫుడ్, గ్రీన్ ఎనర్జీ, ప్రైవేటు పార్కులు, ఎలక్ట్రానిక్స్ కు సంబందించిన ఆరు నూతన పాలసీలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించడం జరిగిందన్నారు.

శుక్రవారం రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్‌లోని ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో గాడితప్పిపోయిన వ్యవస్థలు అన్నింటినీ ట్రాక్ లో పెడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధిపదంలో పరుగులు పెట్టించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అహరహం కృషి చేస్తున్నారన్నారు. ఎంతో దూర దృష్టి ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏపీ అంటే ఎ-అమరావతి, పి-పోలవరం అనే బ్రాండ్తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన వెంటనే పోలవరానికి కేంద్ర నిధులను ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేయించడంలో ఘన విజయాన్ని సాధించారన్నారు. వచ్చే రెండుమూడేళ్లలో ఈ ప్రాజక్టు పూర్తి అవుతుందనే గట్టి విశ్వాసాన్ని రాష్ట్ర ప్రజల్లో ముఖ్యమంత్రి కల్పించారన్నారు.



రాష్ట్ర రాజధాని అయిన అమరావతి ఇప్పటి వరకూ ఒక మిథ్యగా ఉండేదని, అయితే రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టినప్పటి నుండి అమరావతి అభివృద్ధి పనులు ఎంతో నూతనోత్సాహంతో వేగవంతంగా ముందుకు వెళుతున్నాయన్నారు. రానున్న రెండు మూడేళ్లలో రాష్ట్ర రాజధాని అమరావతి అంతర్జాతీయ ప్రమాణాలతో గొప్ప కేపిటల్ సిటీగా మారుతుందనే భరోసాని, విశ్వాసాన్ని రాష్ట్ర ప్రజల్లో ముఖ్యమంత్రి కల్పించారన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో రాష్ట్రంలో రైల్వే, జాతియ రహదారుల అభివృద్ధికి కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు మంజూరు అవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రైల్వే ప్రాజక్టుల అభివృద్ధికై రూ.9,138 కోట్లు, జాతీయ రహదారుల అభివృద్ధికై రూ.6,280 కోట్లను కేంద్ర రాష్ట్రానికి మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో చేపట్టిన అమరావతి, పోలవరం, రైల్వే, జాతీయ రహదారుల అభివృద్ధి పనుల ఫలితంగా సామాజిక ఆర్థికాభివృద్ధి ఎంతో గొప్పగా జరిగి భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుందనే ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఏ ఒక్క నిరుపేద కూడా నాకు ఇల్లులేదనే మాట అనే అవకాశం లేకుండా 2029 కల్లా రాష్ట్రంలోని నిరుపేదలు అందరికీ శాశ్వత గృహాలు నిర్మించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. వారి ఆదేశాలకు అనుగుణంగా గృహ నిర్మాణ కార్యక్రమాలను రాష్ట్రంలో పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు.

## ఆంధ్రా అభివృద్ధికి
# బీజేపీ కట్టుబడి ఉంది

- అమరావతి రైల్వే లైన్‌కు కేంద్రం అనుమతి
- బీజేపీ రాష్ట్ర ఆఫీసు వద్ద సంబరాలు
- ముఖ్యఅతిథిగా మాట్లాడినరాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



**విజయవాడ, మహానాడు:** అమరావతి రైల్వేలైన్‌కు కేంద్రం అనుమతి మంజూరు చేసిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ(బీజేపీ)నేతలు ఇక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆనందం పంచుకుంటూ మిఠాయిలు పంచిపెట్టారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కి ప్రత్యేక రైల్వే లైన్ ఏర్పాటుకు అనుమతితో పాటు నిధులు మంజూరు చేసిన సందర్భంగా బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె ఏమన్నారంటే.. బీజేపీ ప్రభుత్వం 2,545 కోట్ల రూపాయలతో అమరావతి నుండి నంబూరు వరకు కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఒకరకంగా ఆంధ్ర రాష్ట్రం అభి వృద్ధికి ఇది చాలా ఉపయోగకరంగా ఉండబోతుంది.

అకాల వర్షాలతో, పర్యావరణ మార్పుతో ఇబ్బందులకు గురవుతున్నాం. దానికి అనుగుణంగా అడవులను పాడు చేయకుండా ఈ రైల్వే లైన్ వేయడం వలన 25 లక్షల మొక్కలను నాటే అవకాశం ఉంది. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనే కేంద్రం 25, 000 కోట్లు ఇచ్చింది. అదేవిధంగా బడ్జెట్‌లో కూడా అనౌన్స్ చేశారు 25,000 కోట్లు కేటాయించినట్టు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ రైల్వే జోన్ నిర్మాణం కోసం ఇంతకు ముందు ప్రభుత్వాన్ని కోరగా వారు ఇచ్చిన భూమి దానికి అనుకూలం గా లేనందున ముందుకు వెళ్ళ లేకపోయాం. ప్రస్తుత ప్రభుత్వం స్థలం మంజూరుకు సిద్ధంగా ఉన్న దృష్ట్యా నాలుగు మాసాలలో రైల్వే జోన్ పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోంది. అందరి ఆకాంక్ష తో ఎంత త్వరితగతిన అయితే అంత తొందరగా పూర్తి చేస్తాం. మేం మొదటి నుంచి చెపుతూనే ఉన్నాం. డబుల్ ఇంజన్ సర్కార్ పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృధి జరిగితుంది అని.. దానికి అనుగుణంగానే ఈరోజు అమరావతికి సుమారు 57 కి.మీ. రైల్వేలైన్‌ను మంజూరు అయింది. జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, పార్టీకి సంస్థాగత ఎన్నికల రాష్ట్ర రిటర్నింగ్ అధికారి పాకా వెంకట సత్యనారా యణ, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగ భూషణం, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీ శర్మ, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రాం, నేతలు ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, కిలారు దిలీప్, శ్రీధర్, ముప్పల వెంకట సుబ్బయ్య, బొడ్డు నాగలక్ష్మి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నరసరాజు, మహిళా మోర్చా నేతలు గాయిత్రి, బొమ్మ దేవర, రత్న కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పాపాలే మాకు శాపాలుగా మారాయ్

- వైద్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

**అంజనాపురం, మహానాడు:** పల్నాడు జిల్లా, దాచేపల్లి మండలం అంజనాపురం డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో వైద్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, గురజాల ఎమ్మెల్యే ఎరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంజనాపురంలో ఒక డయేరియా మరణం కూడా సంభవించలేదని, మంచినీటి బోరులో మురుగు నీరు కలిసి నీరు కలుషితమై 18 డయేరియా కేసులు నమోదు అయ్యాయని ఒక ప్రాథమిక నివేదిక అందిందని మంత్రి తెలిపారు. మేం అధికారంలోకి వచ్చే సమయానికి వైద్య శాఖలో 2,500 కోట్ల బకాయిలు చెల్లించవలసి ఉన్నాయి.

జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోని అయిదేళ్ళ కాలంలో 10,30,575 మంది అతిసార బారిన పడ్డారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మీరుగాని మీ మంత్రులు గాని ఆ ప్రదేశాన్ని సందర్శించడం కానీ, బాధితులను పరామర్శించడం కాని, వారికి వైద్య సహాయం అందించడం గాని చేశారా? ఇప్పుడొచ్చి శవ రాజకీయలు ఎందుకు చేస్తున్నారని మంత్రి ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి, షర్మిల ఆస్తి పంపకాల విషయాలను డైవర్ట్ చేయటానికి ఇలా శవ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఈ విషయం తెలిసే వెంటనే పై అధికారులకు తెలియజేయకపోవడం బాధ్యత రాహిత్యంతో వ్యవహరించడంతో నోటీసులు అందించాం. గత రెండు రోజులుగా జిల్లా యంత్రాంగం మొత్తం కదిలి అంజనాయపురం కాలనీలో డోర్ టు డోర్ సర్వే చేసి వైద్య సేవ అందిస్తున్నారని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. కాగా, బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. మంత్రి పర్యటనలో కలెక్టర్ పి.అరుణ్ బాబు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, తదితరులు ఉన్నారు.





ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలిసి శుక్రవారం సమావేశమైన సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ.



సచివాలయంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తో హడ్కో ఛైర్మన్ సంజయ్ కుల్ శ్రేష్ఠ శుక్రవారం భేటీ అయ్యారు. విద్యుత్ రంగానికి సంబంధించిన పలు అంశాలపై మంత్రితో చర్చించారు. చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏపీ విద్యుత్ రంగం కొత్తపుంతలు తొక్కుతుందని ప్రశంసించారు. ఇప్పటికే అమరావతి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించేందుకు హడ్కో ముందుకు వచ్చిందన్నారు.



21వ అఖిల భారత జాతీయ పశు గణన కార్యక్రమం - 2024 తిరుపతి జిల్లా కార్యక్రమంలో పాల్గొన్న పశు సంవర్ధక శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్

జనం గుండె చప్పుడు

**మహానాడు**

5

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 26, అక్టోబర్ 2024

# పంట కాలువ కబ్జాపై పవన్ కల్యాణ్ ఆగ్రహం

- తక్షణమే పునరుద్ధరించాలని ఆదేశం
- ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం... పంట కాలువ పునరుద్ధరణకు చర్యలు



**పిఠాపురం,మహానాడు:** నియోజకవర్గంలోని కోలంక గ్రామంలో పంట కాలువను కబ్జా చేసిన ఘటన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. ఈ అంశంపై రెవెన్యూ, పంచాయతీరాజ్, జల వనరుల శాఖ అధికారులతో మాట్లాడారు. 60 ఎకరాలకు సాగు నీరు వెళ్ళే పంట కాలువను లే ఔట్ కోసం కబ్జాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని ఆదేశించారు. తక్షణమే పంట కాలువను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. గతంలో సర్వే చేసిన ఎందుకు ఆక్రమణలు తొలగించలేదని అధికారులను ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గవద్దని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల్లో 'ఎవరు తప్పు చేసినా... నాతో సహా... ఉపేక్షించవద్దు. చట్టం, నిబంధనలకు అనుగుణంగా వెళ్ళాలి' అని చెప్పిన మాటలను అధికారులకు గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అధికార యంత్రాంగం కదిలింది. కోలంక గ్రామంలో గ్రావెల్ తో పంట కాలువను పునరుద్ధరించే పనులను మొదలుపెట్టారు. పంట కాలువ పూర్వ స్థితికి తీసుకువచ్చే పనులు చేస్తున్నారు.

# ఉచిత పంటల బీమాకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం

- రైతు వ్యతిరేక చర్యలను చంద్రబాబు వీడాలి
- రైతులు ఇబ్బందులలో ఉంటే భారం మోపడం ఏంటి?
- వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి



**అమరావతి,మహానాడు:** ఉచిత పంటల బీమాకు కూటమి ప్రభుత్వం మంగళం పాడిందని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయం దండగ అంటూ గతంలోనే వ్యాఖ్యానించిన చంద్రబాబు రైతు వ్యతిరేఖ విధానాలనే కొనసాగిస్తూ రైతుల నడ్డి విరుస్తున్నారన్నారు. అన్నదాతలపై పైసా భారం పడకుండా జగన్ ప్రభుత్వం ఐదేళ్లు విజయవంతంగా అమలు చేసిన వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా కు తాజాగా మంగళం పాడారన్నారు.

ఈ పథకం ఎత్తివేసే కుట్రలో భాగంగా పంటల బీమాపై అధ్యయనం కోసం చంద్రబాబు ప్రభుత్వం పౌరసరఫరాలు, ఆర్థిక శాఖ మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీ వేసిందని, ప్రభుత్వ సూచన మేరకు ఈ సబ్ కమిటీ రైతులకు వ్యతిరేఖంగా నివేదికను సమర్పించిందన్నారు. ఈ పథకం స్థానంలో 2019కి ముందున్న రైతుల భాగస్వామ్యంతో అమలైన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయనున్నారన్నారు.

అధికారంలోకి వచ్చి నాలుగు మాసాలు పూర్తయినా రైతుకు ఎలాంటి సాయం అందించలేదన్నారు. ఈ అక్టోబర్ నుంచి మొదలైన రబీ పంటలకు ,రాబోయే సీజన్ లో పెట్టే పంటలకూ సంబంధించి అన్నదాతలపై బీమా ప్రీమియం భారం మోపారన్నారు.

గత ఐదేళ్లు వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఉచిత పంటల బీమా అమలుతో పాటు పెద్ద ఎత్తున పరిహారం తీసుకుంటూ, ఏ సీజన్ లో పంట దెబ్బతింటే ఆ సీజన్ ముగిసేలోగా పరిహారం అందుకుంటూ ప్రశాంతంగా ఉన్న రైతుల నెత్తిన ఒక్కసారిగా పిడుగు వేశారన్నారు. ఇక నుంచి ప్రీమియం కడితే తప్ప బీమా వర్తించదని ఈ ప్రభుత్వం చెప్పిందన్నారు.

### వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకం దేశంలోనే బెస్ట్ క్రాప్ ఇన్సూరెన్స్ పథకం

వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకం దేశంలోనే బెస్ట్ క్రాప్ ఇన్స్యూరెన్స్ పథకంగా గతంలో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి,ఏపీ తరహాలో మిగిలిన రాష్ట్రాలు కూడా అమలుచేయాలని సూచిందన్నారు. ఇన్నోవేషన్ కేటగిరీ క్రింద 2023లో అవార్డును సైతం జగన్ ప్రభుత్వం పొందిందన్నారు.

ఈ క్రాప్ నమోదే ప్రామాణికంగా అప్పటి జగన్ ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసిందన్నారు.రైతు సాగుచేసిన ప్రతి పంటకూ యూనివర్సల్ కవరేజ్ కల్పిస్తూ రైతులపై పైసా భారం పడకుండా 2019 రబీ నుంచి ఉచిత పంటల బీమాను అమలు చేస్తూ వచ్చిందన్నారు.

మన రాష్ట్ర స్ఫూర్తితో నోటిఫై చేసిన పంటలకూ యూనివర్సల్ కవరేజ్ కల్పించేందుకు ఫసల్ బీమాలో కూడా పలు మార్పులు చేశారన్నారు. ఇలాంటి మంచి పథకాన్ని కూటమి ప్రభుత్వం ఎత్తివేయడం దుర్మార్గమన్నారు.

### పెట్టుబడి సాయాన్ని త్వరితగతిన చెల్లించాలి...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు మాసాలైనా రైతులకు పెట్టుబడి సాయం అందించడం లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ 20 వేలు అందిస్తామంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన టిడిపి అధినేత చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. దీంతో పెట్టుబడుల కోసం రైతులు అధిక వడ్డీలకు అప్పులు చేయక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పాలనలో వ్యవసాయ సలహా మండళ్లను రద్దు చేశారన్నారు.

### ఉచిత పంటల బీమా పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి...

రైతులపై భారం పడకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని ఖచ్చితంగా అమలుచేయాలని శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.రైతులే ప్రీమియం చెల్లించాలన్న పద్దతిలో పంటల బీమా అమలు చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన ఖండించారు. జగన్ హయాంలో రైతులు ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకుండానే బీమా సదుపాయం పొందేవారన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు చంద్రబాబు నాయుడు మాయమాటలు చెప్పారన్నారు.

రైతుల సంక్షేమం మాటల్లో తప్ప చేతల్లో లేదన్న విషయం మారోమారు నిర్ధారణ అయిందన్నారు. పెరిగిన పంటల పెట్టుబడి ఖర్చులకు తోడు బీమా ప్రీమియం రైతులకు తలకు మించిన భారమవుతుందని వివరించారు.

### జగన్ హయాంలో రైతులు బీమా ఉందని ధీమాగా వుండేవారు...

జగన్ హయాంలో ఉచిత పంటల బీమా ఉండడంతో అధిక వర్షాలు కురిసినా, అనావృష్టి పరిస్థితులు ఏర్పడినా రైతులు నిశ్చింతగా ఉండేవారన్నారు. బీమా ఉందని ధీమాగా వుండేవారన్నారు.

ఇప్పుడు వివిధ కారణాలతో పంటలు దెబ్బతింటే ఎలా? ఎవరు తమను ఆదుకుంటారన్న ఆందోళన రైతన్నలలో మొదలైందని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.

# రేవంత్, సంజయ్ (ఆర్ఎస్ బ్రదర్స్) పొలిటికల్ డ్రామా ఆపండి

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీష్ రెడ్డి

**హైదరాబాద్,మహానాడు:** మూసీ ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీలు డ్రామాలు ఆడుతున్నాయి. ఆర్(రేవంత్), ఎస్(సంజయ్) బ్రదర్స్ పొలిటికల్ డ్రామా ఆడుతున్నారు. ధర్నాల పేరుతో పబ్లిసిటీ చేసుకుంటున్నారు. బీజేపీ నుంచి ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఉన్నారు. నిజంగానే మూసీ పరివాహక ప్రజలకు అండగా ఉండాలనే ఉద్దేశం ఉంటే.. ఆ ప్రాజెక్టును ఆపొచ్చు కదా. దానికి కావాల్సిన అనుమతులు ఇవ్వాల్సింది కేంద్ర ప్రభుత్వమే. ప్రపంచ బ్యాంకు నుంచి రావాల్సిన లోన్ కు కూడా అనుమతి ఇవ్వాల్సింది కేంద్రమే.

అలాంటప్పుడు ఇద్దరు కేంద్రమంత్రులు మోడీ దగ్గర, ఆర్థిక మంత్రి దగ్గర కూర్చుని.. ప్రపంచ బ్యాంకులోన్‌ను అడ్డుకోవచ్చు. అప్పుడు మూసీ ప్రాజెక్టు ఆగుతుంది.

లక్షకు కుపైగా కుటుంబాల బతుకులు రోడ్డున పడకుండా ఉంటాయి. కానీ ఇవన్నీ పక్కన పెట్టేసి.. కేవలం పబ్లిసిటీ కోసం రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయడం సరికాదు.

అంతర్గంగా ఇద్దరు మద్దతు ఇచ్చుకుంటూ.. బయటకు మాత్రం బాధ ఉన్నట్టుగా నటిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి, బీజేపీకి, అలాగే రేవంత్ రెడ్డి, ఇద్దరు



కేంద్రమంత్రులకు ఎలాంటి లోపాయికారి ఒప్పందం లేకపోతే వెంటనే ప్రపంచబ్యాంకు లోన్ ప్రతిపాదనను ఆపించాలి. అప్పుడే మూసీ పరివాహక ప్రజల గురించి మాట్లాడే అధికారం బీజేపీకి ఉంటుంది. లేకపోతే కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఒక్కటేనని మరోసారి మీ అంతట మీరే ఒప్పుకున్నట్టు అవుతుంది. మరోవైపు.. ఈ అంశంలో గవర్నర్ జోక్యం చేసుకోవాలి. గతంలో చిన్నచిన్న అంశాలకు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గవర్నర్లు ఇబ్బందులు పెట్టారు. పాలన సరిగా సాగకుండా అడ్డుకున్నారు. కానీ ఇప్పుడు లక్ష కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చినా.. గవర్నర్ ఎందుకు మాట్లాడటం లేదు.? గతంలో బీజేపీ పెద్ద నాయకుల ఆదేశాలతో 9 ముఖ్యమైన బిల్లులు నెలల పాటు ఆపిన గవర్నర్.బీజేపీ నాయకులు ఎందుకు గవర్నర్ ను కలిసి ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని చెప్పడం లేదు.?

అంటే బీజేపీది లోపల ఒకమాట.. బయట ఒకమాట.. అంతర్గతంగా హస్తంతో దోస్తీ చేస్తూ.. బయటకు మాత్రం మూసీ బాధితులకు మద్దతుగా నిలుస్తున్నట్టుగా డ్రామాలు చేస్తున్నారు. కానీ ఈ డ్రామాలు ఎన్నో రోజులు సాగవు. కాంగ్రెస్, బీజేపీల గుట్టు మొత్తం రట్టు చేసి ప్రజల ముందు నిలబెడతాం. మూసీ బాధిత ప్రజలు..ఆ మూసీనీళ్లతోనే రేవంత్ రెడ్డికి, కిషన్ రెడ్డికి, బండి సంజయ్‌కి అభిషేకం చేసి బుద్ధి చెప్తారు.

# కుటుంబ తగాదాలు రాజకీయం చేయొద్దు

- నాలుగు నెలలుగా పాలన గాలికొదిలేశారు
- డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలం వెల్లదీస్తున్నారు
- కూటమి ప్రభుత్వం.. ఫ్యామిలీ పాలన అయింది
- వైయస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్

**ఒంగోలు,మహానాడు:** కుటుంబ తగాదాలు రాజకీయం చేయొద్దని వైయస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్, సీఎం చంద్రబాబును హెచ్చరించారు. ప్రజల సంపదను ఎవరు దోచుకున్నారు?. దాచుకున్నది ఎవరో ప్రజలందరికీ తెలుసని ఆయన అన్నారు. రాష్ట్ర సంపదను జగన్ పేదలకు పంచగా, అదే చంద్రబాబు తన కుటుంబీలుకు దోచిపెట్టారని ఆక్షేపించారు.

నాలుగు నెలలుగా పాలన గాలికొదిలేసి, ఎప్పటికప్పుడు డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలం వెల్లదీస్తున్నారని, కూటమి ప్రభుత్వం కాస్తా.. ఫ్యామిలీ పాలన అయిందని స్పష్టం చేశారు. ఇకనైనా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని, ప్రజలకు మంచి చేసే విషయం ఆలోచించాలని సీఎం చంద్రబాబుకు మాజీ ఎమ్మెల్సీ జూపూడి సూచించారు.

జగన్‌ని ఉద్దేశించి సీఎం చంద్రబాబు అన్న మాటలను ప్రస్తావించిన జూపూడి ప్రభాకర్.. ఎదురిళ్లు, పొరుగిళ్లలోకి తొంగి చూసి స్వార్ధ రాజకీయాలు చేస్తున్నందుకు ఆయన సిగ్గుపడాలని.. అంతేతప్ప



జగన్‌తో రాజకీయాలు చేస్తున్నందుకు కాదని స్పష్టం చేశారు. ఎక్కడా వివక్ష, అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా పథకాలు అమలు చేస్తూ.. వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా గత 5 ఏళ్లలో జగన్‌గారు నిరుపేదల ఖాతాల్లో ఏకంగా రూ. 2.70 లక్షల కోట్లు జమ చేశారని గుర్తు చేశారు. అదే చంద్రబాబు, నాడు ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడు తన సామాజిక వర్గానికి చెందిన రామోజీరావుకు 2 వేల ఎకరాల భూమిని, కేవలం ఒక్క రూపాయికి కట్టబెట్టారని గుర్తు చేసిన మాజీ ఎమ్మెల్సీ.. అది దోచుకోవడమా లేక, పేద ప్రజలకు అండగా నిలబడడాన్ని దోచుకోవడం అంటారా? అని నిలదీశారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎన్నికల నాటికి అన్ని ఇసుక స్టాక్ పాయింట్లలో 87 లక్షల టన్నుల ఇసుక నిల్వ చేస్తే, ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచే దోపిడి మొదలుపెట్టిన అధికార పక్ష నాయకులు సగానికి పైగా ఇసుక దోచుకున్నారని తెలిపారు.

రాష్ట్రంలో ప్రతి కుటుంబంలో వివాదాలు, తగాదాలు ఉంటాయన్న మాజీ ఎమ్మెల్సీ.. జగన్ కుటుంబంలో వివాదాన్ని చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని గుర్తు చేశారు. తన భర్తను చంపేసి, ఆస్తిని కాజేశారన్న లక్ష్మీపార్వతికి, చంద్రబాబు ఏం న్యాయం చేశారని ప్రశ్నించారు. అలాగే హైదరాబాద్‌లోని తన ఆస్తిని ఎన్ని వాటాలు చేశారని.. తమ్ముడు రామ్మోహన్‌నాయుడు, చెల్లెళ్లుకు ఎన్ని వాటాలు పంచారో చంద్రబాబు చెప్పాలని జూపూడి ప్రభాకర్ డిమాండ్ చేశారు.

# కొత్త టూరిజం పాలసీ రూపొందిస్తున్నాం..

- ఏప్రిల్ 2025 నుండి అమల్లోకి రానున్న పర్యాటక హిత పాలసీ
- రాష్ట్ర పర్యాటక రంగానికి పునర్ వైభవం
- పర్యాటకులను ఆకర్షించేలా, స్టేక్ హోల్డర్లకు అనుకూలంగా ఉండేలా పాలసీ రూపకల్పన
- టెంపుల్, ఎకో, వెల్ నెస్ టూరిజంలతో పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట
- ఫిల్మ్ టూరిజం డెవలప్ మెంట్‌కు ఏపీ అనుకూలం
- తెలుగు సినీ ఇండస్ట్రీతో చర్చించి ఏపీలో చలనచిత్ర అభివృద్ధికి చర్యలు
- ప్రభుత్వం తరపున ప్రోత్సాహం అందించేందుకు హామీ
- సీఐఐ టూరిజం అండ్ ట్రావెల్ సమ్మిట్-2024 లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

**విశాఖపట్నం,మహానాడు:** 2025-30 కి సంబంధించి 5 ఏళ్లకు కొత్త టూరిజం పాలసీని రూపొందిస్తున్నామని తద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక రంగానికి పునర్ వైభవం వస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

శుక్రవారం విశాఖపట్నంలోని హోటల్ ఫోర్ పాయింట్స్ బై షెర్టాన్‌లో జరిగిన సీఐఐ టూరిజం అండ్ ట్రావెల్ సమ్మిట్‌లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని ప్రసంగించారు. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించడం శుభపరిణామని, అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా సదస్సులో మంత్రి కందుల దుర్గేష్ వివరించారు.

ఏప్రిల్ 2025 నుండి కొత్త పర్యాటక హిత పాలసీ అమల్లోకి రానుందన్నారు పర్యాటకులను ఆకర్షించేలా, స్టేక్ హోల్డర్లకు అనుకూలంగా ఉండేలా పాలసీ రూపకల్పన చేస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 27వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అంతర్జాతీయ పర్యాటక దినోత్సవంలో రాష్ట్ర పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారని తెలిపారు.

ఇండస్ట్రీలకు ఇచ్చే బెనిఫిట్స్ అన్నీ టూరిజానికి కూడా కల్పిస్తామన్నారు. పర్యాటక అభివృద్ధి కోసం ప్రాజెక్టలతో ముందుకు వస్తే ప్రభుత్వ పరంగా రాయితీలు కల్పిస్తామన్నారు. మొత్తం ఉపాధి కల్పనలో టూరిజం ద్వారా కనీసం 20 శాతం ఉద్యోగాలు కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి తెలిపారని మంత్రి వివరించారు.

రాష్ట్ర పర్యాటకానికి సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో ఊరట ఇచ్చే మాట చెప్పారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. వివిధ వర్గాల నుంచి తీసుకున్న సమాచారంతో కార్యాచరణ ప్రారంభించామన్నారు.

కేరళ తరహాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటకం అభివృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని వనరులున్నాయని అందులో భాగంగా 974 కి.మీల సుదీర్ఘ తీర ప్రాంతం, పదుల సంఖ్యలో బీచ్ లు, అపార




సహజ వనరులు, నదులు, చరిత్ర, సంస్కృతి, ప్రాచీన ఆలయాలు, బౌద్ధారామాలు, వన్య ప్రాణి అభయారణ్యాలు, జాతీయ పార్క్ లు ఇలా ఎన్నో విధాలుగా పర్యాటకులను ఆకర్షించే ప్రాంతాలు ఉన్నాయని మంత్రి దుర్గేష్ తెలిపారు.

పర్యాటకులను ఆకర్షించేలా టెంపుల్, ఎకో, అడ్వెంచర్, వెల్ నెస్, అగ్రి టూరిజంలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ లు ఏర్పాటు చేస్తున్నామని తద్వారా సత్ఫలితాలు సాధిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల కృషితో కేంద్ర ప్రభుత్వం సైతం స్వదేశీ దర్శన్, ప్రసాద్ తదితర పథకాలతో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని వృద్ధి చేయడానికి ముందుకు రావడం హర్షణీయమన్నారు.

వందల కోట్ల కేంద్ర ప్రభుత్వ పర్యాటక పథకాల నిధులతో పర్యాటకాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీ పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక సహకారం ఉంటుందని దక్షిణాది రాష్ట్రాల పర్యాటక మంత్రుల సదస్సులో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ వెల్లడించారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

రాష్ట్ర పర్యాటక ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక (డీపీఆర్) సిద్ధం చేశామని త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. రాష్ట్రంలో బీచ్ టూరిజం అభివృద్ధి చేసి జనవరిలో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. సినిమాలు, లఘు చిత్రాల ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రాచుర్యం కల్పిస్తామన్నారు.

దేశంలో 3వ అతిపెద్ద సముద్రతీరం ఏపీలో ఉన్నప్పటికీ కేవలం రుషికొండ మాత్రమే బ్లూఫాగ్ బీచ్ గా ఎంపికైందని దానితో పాటు అందమైన కాకినాడ, సూర్యలంక, మైపాడు, రామాపురం బీచ్ లున్నాయని గుర్తుచేశారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానాలు, అక్రమాల వల్ల పర్యాటక రంగం కుంటుపడిందని తద్వారా పర్యాటకంగా రాష్ట్రం చాలా నష్టపోయిందని మంత్రి విమర్శించారు.

ఎండో మెంట్, ఫారెస్ట్, టూరిజం మంత్రులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైందని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. టెంపుల్, ఎకో టూరిజం అభివృద్ధికి అవసరమైన సలహాలు తీసుకొని ముందుకెళ్తామన్నారు. రాష్ట్రంలో అధ్యాత్మిక ప్రాంతాలుగా తిరుపతి, అన్నవరం, శ్రీశైలం, సింహాచలం తదితర ప్రాంతాలున్నాయని తెలిపారు.

రాష్ట్రంలో 90 శాతం మంది అధ్యాత్మిక ప్రాంతాలకు వచ్చే పర్యాటకులేనని ఈ క్రమంలో ఉదాహరణకు సింహాచలం లాంటి ప్రాంతానికి పర్యాటకుడు వస్తే సమీపంలోని లంబసింగి, అరకులోయ, మారేడుమిల్లి తదితర ప్రాంతాలను సందర్శించేలా సర్క్యూట్ లు అభివృద్ధి చేయాలని భావిస్తున్నామని తద్వారా ఆయా ప్రాంతాలకు వచ్చే పర్యాటకులు మూడు, నాలుగు రోజుల పాటు ఉండే విధంగా మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

రిసార్ట్‌లు, జంగిల్ సఫారీలు, రోప్ వేలు, ఐకానిక్ బ్రిడ్జిలు, అడ్వెంచరస్ యాక్టివిటీస్, వాటర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ ద్వారా టెంపుల్ టూరిజంతో పాటు ఎకో టూరిజం డెవలప్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా తొట్లకొండ, శాలిహుండం తదితర ప్రాంతాల్లో బౌద్ధారామాలు అభివృద్ధి చేయాలని భావిస్తున్నామన్నారు. దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో భాగంగా నీతి ఆయోగ్ గ్రోత్ హబ్ నగరంగా దక్షిణ భారత దేశంలో విశాఖకు చోటు కల్పించడం గర్వించదగ్గ అంశమన్నారు.

విశాఖపట్నంను క్రూయిజ్ హబ్ గా తీర్చిదిద్దుతామన్నారు. విశాఖపట్నం నుండి చెన్నై, పుదచ్చేరి ప్రాంతాలకు వెళ్లేలా లగ్జరీ క్రూయిజ్ లు ఏర్పాటు చేసి క్రూయిజ్ టూరిజం డెవలప్ చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒబెరాయ్, తాజ్ లాంటి ప్రఖ్యాత సంస్థలు ముందుకొచ్చాయని, పర్యాటక ప్రాంతాల్లో స్టార్ హోటళ్లు పెడతామని చెప్పడం సంతోషకరమన్నారు.

ఏపీలో సినీరంగం అభివృద్ధి చెందాలని మంత్రి కందుల దుర్గేష్ కాంక్షించారు. రాష్ట్రంలో ఫిల్మ్ టూరిజం అభివృద్ధి చెందేందుకు మంచి అవకాశాలున్నాయని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. చిత్రపరిశ్రమ అభివృద్ధికి విశాఖపట్నం అనుకూలంగా ఉంటుందని తెలిపారు. విశాఖలో షూటింగ్స్ కోసం సింగిల్ విండో సిస్టం తీసుకొస్తామన్నారు.

రాష్ట్రంలో ఫిల్మ్ టూరిజం డెవలప్ మెంట్ కు సంబంధించి ఏ పాలసీలు అమలు చేస్తే బాగుంటుందో సూచించాలని సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్ ను కోరారు. పీపీపీ విధానంలో ముందుకెళ్లి అభివృద్ధి చేసుకుందామని సూచించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున సినిమా షూటింగ్ జరుగుతున్నాయని, ఇదే క్రమంలో చిత్ర పరిశ్రమను వృద్ధి చేసుకోవాల్సిన అవసరముందని మంత్రి అభిప్రాయపడ్డారు.

తద్వారా పలువురికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈ విషయంపై సినీ ఇండస్ట్రీ పెద్దలతో విజయవాడలో సమావేశం ఏర్పాటు చేసుకొని చర్చిద్దామన్నారు. సినిమా ఇండస్ట్రీ కోరిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఇప్పటికే టికెట్ల రేట్ల విషయంలో తాము చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగే షూటింగ్ లకు సంబంధిత ప్రాంతాల పేర్లను ప్రదర్శించాలని కోరారు. తద్వారా ఏపీ టూరిజం మరింత వృద్ధి చెందుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రుషికొండ భవనాలను ఎలా వినియోగించుకోవాలన్న అంశంపై నెలరోజుల్లో స్పష్టత వస్తుందన్నారు.

కార్యక్రమంలో విశాఖపట్నం ఎంపీ ఎం. శ్రీభరత్, సురేష్ ప్రొడక్షన్స్ సీఈవో, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు, సీఐఐ విశాఖపట్నం ఛైర్మన్ రాజేష్ గ్రంధి, సీఐఐ విశాఖపట్నం వైస్ ఛైర్మన్ వి.అజయ్ కుమార్, సీఐఐ టూరిజం ప్యానెల్ కన్వీనర్ రాజీ ఇందుకూరి, జేఎల్ఎల్ ప్రతినిధి జెర్రి కింగ్స్లే, సీనియర్ డైరెక్టర్ ఎస్. రాబిన్, సీఐఐ ప్రతినిధులు వి. మురళీకృష్ణ, ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎస్. రాజారెడ్డి, ఇమాజికా వరల్డ్ ఎంటర్టైన్ మెంట్ లిమిటెడ్ సీఈవో ధీమంత్ బక్షి, హాలిడుస్ బిజినెస్, యాత్రా ఆన్ లైన్ లిమిటెడ్ సీఓఓ క్రిషన్ సింగ్, హాలిడే వరల్డ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ మోహన్, బుక్ మై షో వర్ధన్ సిగటాపు, నీతి ఆయోగ్ కన్సల్టెంట్ మన్వేంద్ర జైన్ తదితరులు పాల్గొన్నారు.

06
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 26, అక్టోబర్ 2024 ‖

# ప్రజలు ప్రశ్నిస్తే వచ్చిన తప్పేంటి?

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



హైదరాబాద్,మహానాడు:

ఎన్నికల ముందు రైతులకు రేవంత్ రెడ్డి ఆశ కల్పించారు. రుణ మాఫీ, రైతు భరోసా,పంట బోనస్ ఇస్తామని అన్నారు. వరి పంట బోనస్ సన్న వడ్లకే ఇస్తామని అంటున్నారు. రైతు రుణమాఫీ పూర్తి కాలేదు. తెలంగాణలో ప్రత్తి పంటకు మద్దతు ధర పలకడం లేదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. దొడ్డు ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇవ్వాలి. రైతుబంధు మూడు పంటలకు ఇవ్వాలని రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసా ఎప్పటిలోగా ఇస్తారో చెప్పాలి. ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీలు ఇచ్చింది వాస్తవం కాదా? ప్రజలు ప్రశ్నిస్తే వచ్చిన తప్పు ఏంటి?

ఎన్నికల ముందు సోషల్ మీడియా యూనివర్సిటీ పెట్టి బిఆర్ఎస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని మహేష్ కుమార్ గౌడ్ సీఎం రేవంత్ రెడ్డికి చెప్పాలి. పాలనపై కాంగ్రెస్ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. కుట్రపూరితంగా బిఆర్ఎస్ నేతలపై కేసులు పెట్టాలని చూస్తున్నారు.

పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్‌లో ఏం జరిగిందో చెప్పాలి. ప్రభుత్వ కుట్రలను ఎదుర్కొవాదానికి సిద్ధంగా ఉన్నాము.

హిందువుల సొమ్ము కావాలి..

# కానీ దేవతలు వైరస్‌ట!

- తమిళనాడులో భక్తుల బంగారాన్ని కరిగించిన స్టాలిన్ సర్కారు
- 30 బిలియన్ డాలర్లు ఖజానాలో ? వేసుకున్న డీఎంకె సర్కార్
- హిందూ దేవతలను వైరస్, ఎయిడ్స్, కరోనాతో పోల్చిన డీఎంకె
- అదే హిందువుల డబ్బుతో ఖజానా నింపేసుకునే కక్కుర్తి
- డబ్బు, బంగారం వేయవద్దంటూ మొదలైన ప్రచారం



5 lakh kg of jewellery in temples melted: Govt.

LEGAL CORRESPONDENT
CHENNAI

The State government on Tuesday told the Madras High Court that the practice of melting temple gold jewellery was not new and that it has been in vogue since 1977. The court was also told that so far 5 lakh kg of jewellery had been melted and deposited in banks.

Appearing before a Division Bench of Justices R. Mahadevan and Abdul Quddhose, Advocate General R. Shunmugasundaram said the government had on September 9 constituted three panels to oversee the work.

The submissions were made during the hearing of two public interest litigation petitions filed against the practice. The judges asked the petitioners to file additional affidavits, if necessary, by October 21.



(యోగానంద్)

తమిళనాట డీఎంకె సర్కారులో ఉన్న సీఎం స్టాలిన్ నుంచి ఆయన సన్ వరకూ అంతా నాస్తికులే. ద్రవిడ మంత్రం వారిది. హిందీకి వ్యతిరేకం. నో ఇంగ్లీష్, ఓన్లీ తమిళ్. అంతే కాదు. హిందూమతానికీ వ్యతిరేకమే. అసలు డీఎంకె దృష్టిలో హిందూ దేవతలంటే ఒక వైరస్. ఒక ఎయిడ్స్ లాంటి జబ్బు. ఒక కరోనా. ఆ మాట డీఎంకె మంత్రులే సెలవిచ్చారు. మరి హిందువులంటే అంత వ్యతిరేకత, చులకన ఉన్న పాలకులు.. దేవాలయాల్లో భక్తులు వేసే డబ్బు, బంగారం ముట్టకూడదుకదా? కానీ మతం మతమే. డబ్బు డబ్బేనట.

హిందూమతంపై అంత అక్కసు, విద్వేషం వెళ్లగక్కిన డీఎంకె సర్కారు.. నిస్సిగ్గుగా అదే ఆలయాల్లో భక్తులు సమర్పించిన బంగారాన్ని కరిగించి, దాన్ని కడ్డీలుగా మార్చి, ఖజానాలో వేసుకుంది. దానితో కడుపుమండిన భక్తజనం, అసలు హుండీల్లో డబ్బు, బంగారం వేయవద్దన్న ప్రచారానికి తెరలేపింది. ఏంటీ..నమ్మకం కలగడం లేదా? అయితే ఇది చదవండి. 1977 నుంచి కేవలం తమిళనాడు ప్రభుత్వం దేవాలయాలలో భక్తులు సమర్పించిన సుమారు 500000 ఐదు లక్షల కిలోల బంగారు నగలను స్వాధీనం చేసుకుని, ఆ నగలను కరిగించి కడ్డీలుగా మార్చి, బ్యాంకుల్లో తన పేరు మీద డిపాజిట్ చేసుకుంది. దీని విలువ 250000 లక్షల కోట్లు. 30 బిలియన్ డాలర్లు. ఇది కాక దేవాలయాల మీద వచ్చే ఇతర ఆదాయాలు అదనం.

ఇది ఎవరో చెప్పింది కాదు. స్వయంగా తమిళనాడు అడ్వొకేట్ జనరల్ మద్రాస్ హైకోర్టు ముందు ఒప్పుకున్న సత్యం. హిందూ దేవతలను వైరస్‌లుగా, ఎయిడ్స్, కరోనాతో పోల్చిన డీఎంకే ప్రభుత్వం, హిందువులు దేవాలయాల్లో సమర్పించిన బంగారాన్ని ఆదాయాన్ని అప్పనంగా అనుభవిస్తుంది. ఇది, కేవలం తమిళనాడు రాష్ట్రం వరకే పరిమితమైన అపచారం కాదు. తెలుగు రాష్ట్రాలలోని అన్ని దేవాలయాలు చేసే వ్యవహారమే.

అందుకే, ఇప్పటికైనా, దేవాలయ హుండీల్లో ఒక్క రూపాయి కూడా వేయకండి. ఏ సేవలకు డబ్బులు కట్టకండి ఆ దేవాలయాలలో కొలువై ఉన్న దేవతా మూర్తులను కించపరిచే వ్యక్తులు, పార్టీలకు అవి చేరుతున్నాయి. మానవసేవే మాధవ సేవ అన్నారు కాబట్టి, మరో రూపంలో సమాజానికి సేవ చేద్దాం.

# కరెంట్ ఛార్జీల భారం మోపి సంపద పెంచుకోవాలనే ఆలోచన దుర్మార్గం

- డిస్కమ్‌లంటే డిస్ట్రిబ్యూషన్ సంస్థలే
- ఖజానాకు కంట్రిబ్యూషన్ చేసే కంపెనీలు కాదు
- విద్యుత్ అంటే వ్యాపారం కాదు
- రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించే రథచక్రం
- ప్రతిపాదించిన ఛార్జీలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని కోరుతున్నా
- 12 వందల కోట్లు పెంచుకోవటంతో పాటు డిస్కంలు చేసిన 9 ప్రతిపాదనలు తిరస్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నా
- విద్యుత్ ఛార్జీల పెంపునకు సంబంధించిన ఈఆర్సీ సిరిసిల్లలో ఏర్పాటు చేసిన బహిరంగ విచారణలో పాల్గొని మాట్లాడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిరిసిల్ల,మహానాడు:

తెలంగాణ ఏర్పడిన నాడు మనం తీవ్రమైన విద్యుత్ కొరతతో ఉన్నాం. పారిశ్రామిక వేత్తలు పవర్ హాలిడేస్ వద్దని ఇందిర పార్క్ వద్ద ధర్నాలకు దిగిన పరిస్థితి. మరో వైపు రైతులు కరెంట్ లేక తీవ్ర నిరాశలో ఉన్న పరిస్థితి. మా సిరిసిల్లలో క్షూడా పవర్ లూమ్ పరిశ్రమ కరెంట్ తోనే ముడి పడి ఉంది. ఇక్కడ కూడా కరెంట్ లేక ఎంతో మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు.

తెలంగాణ అభివృద్ధికి సంబంధించి ప్రతి మనిషికి విద్యుత్‌తో విడదీయరాని సంబంధం ఉంది. కేసీఆర్ ప్రభుత్వంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు పదేళ్ల పాటు విద్యుత్ సంస్థలకు సర్ణయుగంగా మారింది. కానీ కాంగ్రెస్ వచ్చిన 10 నెలల్లోనే కరెంట్ కోతలు మొదలయ్యాయి. దానికి తోడు ఇప్పుడు కరెంట్ ఛార్జీల వాతలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. పాలకులకు విజన్ ఉంటే సంపద పేదలకు పంచాలి. కానీ.. ప్రజలపై కరెంట్ చార్జీల భారం మోపి..సంపద పెంచుకోవాలనే ఆలోచన చేయటం దుర్మార్గం.

డిస్కమ్ లంటే డిస్ట్రిబ్యూషన్ సంస్థలే. ఖజానాకు కంట్రిబ్యూషన్ చేసే కంపెనీలు కాదు. విద్యుత్ అంటే వ్యాపారం కాదు..రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించే రథచక్రం. విద్యుత్ సంస్థల బలోపేతం కోసం..చేసే ఖర్చు భారం కాదు. అది ప్రభుత్వ బాధ్యత. అదనపు ఆదాయం కోసం.. 18 వేల కోట్ల అదనపు భారం మోపాలన్న కాంగ్రెస్ సర్కారు ఆలోచనే ప్రజా వ్యతిరేకమైనది.

విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన ఛార్జీలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని కోరుతున్నా. వివిధ కారణాలు చెప్పిన 963 కోట్లు అప్ ఛార్జీలను ప్రజలపై భారం వేయాలనుకోవటం సరికాదు. ఈ ఆర్థిక సంవత్సరానికి కూడా తక్షణం రూ. 12వందల కోట్లు పెంచుకోవటంతో పాటు డిస్కంలు చేసిన 9 ప్రతిపాదనలు తిరస్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నా. కేసీఆర్ అధికారంలో ఉన్నపుడు పదేళ్ల పాటు




రాష్ట్ర ప్రజల మీద ఒక్క రూపాయి భారం వేయలేదు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, మిషన్ భగీరథ లాంటి ప్రాజెక్ట్ ఉచితంగా నీళ్లు ఇచ్చినప్పటికీ ఒక్క రూపాయి భారం వేయలేదు.

మా సిరిసిల్లలో నేతన్నలకు 10 హెచ్ పీ మీద 50 శాతం సబ్సిడీ కూడా ఇచ్చాం. ఇప్పుడు 10 హెచ్ పీలను 30 హెచ్ పీ ల వరకు పెంచి 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని కోరుతున్నా. ఇళ్లకు 300 యూనిట్లకు దాటితే ప్రస్తుతం ఉన్న రూ. 10 ఫిక్స్ డ్ ఛార్జీలను 50 కి పెంచాలని ప్రతిపాదించారు. దీన్ని వ్యతిరేకిస్తున్నాం. ఒక్క సెస్ పరిధిలోనే తీసుకుంటే లక్షా 20 వేలకు పైగా కనెక్షన్లు ఉంటే 75 వేల కనెక్షన్ల వరకు ఎండకాలంలో 300 యూనిట్లకు పైగా వాడుతున్నారు. కరెంట్ వినియోగమనేది గతంతో పోల్చితే చాలా వరకు పెరిగింది.

ఇప్పుడు డిస్కంలు చేసిన ప్రతిపాదన ఏదైనా ఉందో పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచేలా ఉంది. ఈ ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. 11కేవీ, 33కేవీ, 220 కేవీ కింద నడిచే పరిశ్రమలకు సంబంధించి అన్నింటిన ఒకే కేటగిరీ లోకి తేవటమనేది అసంబద్ధం.

అదానీ ఒక ఫ్యాక్టరీ పెడితే వారికి వర్తించే కేటగిరీనే మా సిరిసిల్లలో సాంచాలు నడిపే పరిశ్రమకు ఉంచాలనుకోవటం హేతుబద్ధమైన నిర్ణయం కాదు. పరిశ్రమలకు సంబంధించి కరెంట్ ను అన్నింటిని ఒకే గాటున కట్టటమంటే సూక్ష్మ చిన్న, మధ్య పరిశ్రమలకు ఉరి వేస్తున్నట్లే.ఈ విధమైన కుట్ర చేస్తూ చిన్న పరిశ్రమలకు రాయితీ ఇవ్వకుండా ఉండే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి కుంటుపడింది. చాలా పరిశ్రమలు తరలి పోతున్నాయి. ఇంకా ఛార్జీలు పెంచితే పరిశ్రమలకు తీవ్ర నష్టం జరుగుతుంది. కుటీర పరిశ్రమలు, చిన్న పరిశ్రలు బేంబేలెత్తేపోతాయి.

డిస్కంలు చేసిన ప్రతిపాదనలకు వాస్తవ పరిస్థితులకు పొంతన లేదు.రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు మేము 12 వందల కోట్లు భరించాం. ఈ ప్రభుత్వం ఎందుకు భరించదు? పదేళ్లు మేము ఛార్జీలు పెంచలేదు. ఇప్పుడు పదినెలలకే ఎందుకు ఛార్జీలు పెంచే ప్రయత్నం చేస్తున్నారు.కరెంట్ ఛార్జీల పెంపు కారణంగానే తెలంగాణ ఉద్యమం పుట్టింది. ఆనాడు ఛార్జీలు పెంచితేనే కేసీఆర్ ఉద్యమం మొదలుపెట్టారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే అదే పరిస్థితి తేవటం శోచనీయం. ఈఆర్సీ ఛైర్మన్ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ ప్రాంత బిడ్డగా తెలంగాణ ప్రయోజనాలకు నష్టం చేకూర్చే ప్రతిపాదనలను తిరస్కరించాలని మిమ్మల్ని కోరుతున్నాను.


సిరిసిల్లలో నేతన్నల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పదేళ్లు బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాం వంటి ఆర్డర్ ఇక్కడి నేతన్నలకు ఇచ్చాం. వర్కర్ టూ ఓనర్ పథకం కోసం దాదాపు రూ. 400 కోట్లు ఖర్చు చేశాం. అప్పెరల్, టెక్స్ టైల్ పార్క్ లను బలోపేతం చేశాం. మరమగ్గాలను మోడ్రనైజేషన్ చేశాం. గత పదేళ్లలో సిరిసిల్లలో ఆత్మహత్యలు ఆగిపోయాయి. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 10 మందికి పైగా నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు. సిరిసిల్లలో 10 హెచ్‌పీల వరకు మాత్రమే సబ్సిడీ ఉంది. దాన్ని 30 హెచ్ పీ వరకు పెంచాలి.

సిరిసిల్లను మరో తిరుపూర్ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం ప్రయత్నం చేసింది. ఇప్పుడున్న ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వటం లేదు. వారికి ఆర్డర్లు వచ్చేవిధంగా ప్రభుత్వాన్ని కోరాలని మిమ్మల్ని విజ్ఞప్తి చేస్తున్నా. మానవీయ కోణంలో ఆలోచించి ఇక్కడ ఉన్న 10 హెచ్ పీ సబ్సిడీని 30 హెచ్‌పీల పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నా. మొత్తంగా ప్రజలపై 18 వేల కోట్ల భారాన్ని మోపాలని చేస్తున్న ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరుతున్నా.

అదే విధంగా డిస్కంల ప్రతిపాదనలను తిరస్కరించాలని ఈఆర్సీకి విజ్ఞప్తి చేస్తున్నా.

# కొత్త రైల్వే లైన్‌తో రాజధాని ప్రాంతం అభివృద్ధి

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, మహానాడు:

అమరావతి నూతన రైల్వే లైన్ నిర్మాణంతో రాజధాని ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అమరావతి నూతన రైల్వే లైన్ కు కేంద్రం ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో నూతన రైల్వే లైన్ నిర్మాణంతో అమరావతి రాజధానికి మహర్దశ పడుతుందన్నారు.

ఎర్రుపాలెం నుండి అమరావతి మీదుగా నంబూరు వరకు నిర్మించనున్న నూతన రైల్వే లైన్ రాజధానికి మణిహారంగా నిలవనుందన్నారు. ఈ రెండింటి మధ్య వాహన రద్దీ తగ్గుతుందన్నారు. అమరావతి నూతన రైల్వే లైన్‌కు ఆమోదం తెలిపిన కేంద్రానికి, కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

యువతకు వినూత్న- భవిష్యత్తు నైపుణ్యాలపై

# సీడ్ యాప్ సంస్థలో వర్క్‌షాప్

అమరావతి,మహానాడు:

పరిశ్రమతో రాష్ట్ర యువతను మమేకం చేసే లక్ష్యంతో వారికి శిక్షణ అందించి మెరుగైన ఉపాధితో మంచి జీవితాలను అందించేందుకు సీడ్ యాప్ సంస్థ కృషి చేస్తుందని సంస్థ చైర్మన్ దీపక్ రెడ్డి గుణపాటి తెలిపారు. ఎనిమిది సెక్టార్ల వారితో ఎన్టీఆర్ పరిపాలనా భవనంలో సీడ్ యాప్ కార్యాలయంలో శుక్రవారం యువతకు శిక్షణ, ఉపాధి పై వర్క్ షాపు నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా సీడ్ యాప్ సంస్థ చైర్మన్ దీపక్ రెడ్డి గుణపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రలకు అవసరమైన శిక్షణ, నైపుణ్యం కల్గిన యువతను అందించేందుకు సీడ్ యాప్ సన్నద్ధంగా ఉందన్నారు. ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన అత్యాధునిక ఆరు విధానాల రూపకల్పనలో సీడ్ యాప్ ఉందన్నారు.

రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించే వారికి స్కిల్డ్ యువతను అందిస్తామన్నారు. దీనివల్ల రాష్ట్రంలోని యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ప్రస్తుతం మరియు భవిష్యత్‌లో పరిశ్రమల డిమాండ్లకు అవసరమైన వారి కోసం నైపుణ్యాభివృద్ధి కార్యకలాపాలను ప్లాన్ చేయడానికి ఇది సరైన సమయమన్నారు.

సీడ్ యాప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా. కె. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. 2005 నుండి వివిధ నైపుణ్యాభివృద్ధి పథకాలను రాష్ట్రంలో అమలు చేయడంలో సీడ్ యాప్ సంస్థ విజయవంతమైన ట్రాక్ రికార్డ్‌ను కలిగి ఉందన్నారు. ప్రస్తుతం భారత దేశ ప్రభుత్వ చొరవ తో 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ' అమలులో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు.

సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్, లెదర్, ఫర్నీచర్ & ఫిట్టింగ్స్, ఫుడ్ ఇండస్ట్రీ, కెపాసిటీ & స్కిల్ ఇనిషియేటివ్, రత్నాలు & ఆభరణాలు, హస్తకళలు, గృహ కార్మికులు, వికలాంగులు మరియు క్రీడల కు సంబంధించిన అధికారులతో వర్క్ షాపు నిర్వహించారు. ఈ వర్క్ షాపులో వివిధ రంగాల్లో శిక్షణా కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. శిక్షణ మరియు ఉత్పత్తి కేంద్రాలుగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయడం కోసం వివరణాత్మక చర్చలు కూడా జరిగాయి.




శిక్షణ మరియు నాలెడ్జ్ పార్ట్‌నర్‌షిప్ సహకారం కోసం సీడ్ యాప్ లెదర్, సెక్టార్ స్కిల్ కౌన్సిల్ మరియు ఫర్నీచర్ & ఫిట్టింగ్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌తో ఒక అవగాహన ఒప్పందం జరిగింది.. ఈ వర్క్ షాపులో సీడ్ యాప్ సంస్థ సిబ్బంది మరియు డీడీయూజీకేవై ప్రాజెక్ట్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీల ప్రతినిధులు మరియు ఇతర పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.

తల్లిని, చెల్లిని బజారున పడేసిన

# అనైతిక చరిత్ర జగన్ రెడ్డిది

- నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చిన వ్యక్తి జగన్ రెడ్డి
- ధన దాహంతో కుటుంబ వ్యవస్థనే జగన్ అగౌరవపరుస్తున్నారు
- తల్లి, చెల్లిని వీధికి లాగి ఆస్తికోసం వెంపర్లాడుతున్న వ్యక్తి జగన్ రెడ్డి
- తెలుగుదేశం పార్టీ(టీడీపీ) పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య



మంగళగిరి, మహానాడు:

ధన దాహంతో కుటుంబ వ్యవస్థను జగన్ రెడ్డి అగౌరవపరుస్తూ.. తల్లిని, చెల్లిని వీధికి లాగారని.. నైతిక విలువలు లేని వ్యక్తి జగన్ రెడ్డి అని.. షర్మిలకు కట్టుదిట్టమైన రక్షణ కల్పించాలని.. లేదంటే ఆమె ప్రాణాలకు ముప్పు ఉంటుందని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. ఇక్కడి పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

దోపిడీ ఆస్తుల పంపకంలో దుష్ట సంప్రదాయానికి జగన్ రెడ్డి తెరతీశారు. భారత కుటుంబ వ్యవస్థను ప్రపంచం అంతా గౌవరవిస్తుంటే, ఆ విలువలకు జగన్ రెడ్డి తిలోదకాలిచ్చారు. జగనన్న వదిలిన బాణం షర్మిల అని ఆమె నాడు ప్రచారం చేసింది. ఆ బాణమే నేడు తన గుండెల్లో గుచ్చుకుంది. జగన్ రెడ్డిని చూసి విజయమ్మ ప్రాణ భయంతో నాడు పారిపోయిందని ప్రజలనుకుంటున్నారు. మీ బంగారం మంచిది అయితే స్వర్ణకారులు ఏం చేస్తారు జగన్ రెడ్డి? జగన్ రెడ్డి వద్ద 8 లక్షల 32 వేల కోట్లు అక్రమ ఆస్తులు ఉన్నట్టు ప్రజల వాక్కు. 2004 సంవత్సరంలో జగన్ రెడ్డి తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వేసిన ఎన్నికల అఫిడవిట్ లో చూపిన ఆస్తి రూ. 1. 76 కోట్లు, 2009 లో చూపింది రూ.2.6 కోట్లు మాత్రమే. జగన్ రెడ్డి 2004 లో ఒక కోటి 73 లక్షలు 2009 లో 38 కోట్లు, 2011 బై ఎలక్షన్ లో 390.73 కోట్లు, 2019 ఎలక్షన్ లో రూ. 500 కోట్లు, 2024 ఎన్నికల్లో 757.65 కోట్లు చూపించారు. ఇంతాల పెరగడం ఎలా సంభవం..? టాటా, బిర్లా, అంబానీల ఆస్తులు కూడా ఈ రేషియోలో పెరగలేదే? మీకు ఎలా సాధ్యమైంది జగన్ రెడ్డి? ప్రజలకు చెప్పండి. ఆస్తులపై ధైర్యంగా జనాలకు మీరు సమాధానం చెప్పగలరా? అని వర్ల ప్రశ్నించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

బహిరంగంగా 16 కంపెనీలు... రహస్యంగా 50కి పైగా సూటికేస్ కంపెనీల లకు ఎలా అధిపతి అయ్యారు జగన్ రెడ్డి? వేలాది ఎకరాలు, బెంగళూరు, ఇడుపులపాయతో పాటు పలు రాష్ట్రాల్లో ఉన్న ప్యాలెస్ లు ఎలాకట్టారో చెప్పగలరా? సీబీఐ 43 వేల కోట్లు అన్యాక్రాంతం చేశారని ఛార్జ్ షీట్ వస్తే.. ఆ నేరం నేను చేయలేదని మీరు ఎందుకు సమాధానం చెప్పలేదు జగన్ రెడ్డి? అక్రమ ఆస్తులు కనుకే కుటుంబ వ్యవస్థను రోడ్డుకు ఈడ్చి చెల్లి, తల్లి అని లేకుండా వారిని ఇబ్బందులు పెడుతున్నారు. 12 ఏళ్ళు బెయిల్ మీద ఉన్న వ్యక్తి కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతుంటే న్యాయవ్యవస్థ దేశ ప్రజలకు ఏ సమాధానం చెబుతుంది? సామన్య ప్రజల విషయంలో ఒకరకంగా.. ఆర్థిక ఉగ్రవాదులు, అవినీతి సొమ్ముతో రాజకీయాలను ఏలుతున్న ఉగ్రవాదుల పట్ల కోర్టులు ఎందుకు మరోలా వ్యవహరిస్తున్నాయని ప్రజలను కుంటున్నారు! దేశంలోనే అత్యధిక ఆస్తులు ఉన్న ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అని ది ప్రింట్, ఏడీఆర్ వంటి సంస్థలు చెప్పాయి.

భారత దేశంలో అత్యంత ధనవంతులైన ముఖ్యమంత్రిగా ఎలా రూపాంతరం చెందారో రాష్ట్ర ప్రజలకు చెప్పగలరా? మీ సంపాదనపై సుప్రీంకోర్టే ఆశ్చర్యం వ్యక్తం చేసింది నిజం కాదా జగన్ రెడ్డి. ఇసుక, మైన్స్, గంజాయి, ల్యాండ్స్, స్మార్ట్ మీటర్స్, కోవిడ్ మందుల కొనుగోలు, భారతి సిమెంట్స్ కట్టబెట్టిన దోపిడీలు అన్నీ కలిపి ఎనిమిది లక్షల కోట్లు పైనే అని ప్రజలు అనుకుంటున్నారు. తల్లిని, చెల్లిని బజారుపాలు చేసిన మీరు ఇంకో మహిళకు న్యాయం చేస్తానంటే రాష్ట్రంలో ఏ మహిళా నమ్మదు. వాసిరెడ్డి పద్మతో సహా.


# టీడీపీ సభ్యత్వం ఉందంటే ఒక ధైర్యం, ఒక భరోసా!

- 'దర్శి' ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి


దర్శి, మహానాడు:

తెలుగుదేశం పార్టీ(టీడీపీ) సభ్యత్వం ఉందంటే ఒక ధైర్యం, ఒక భరోసా... పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ఆ భరోసా ఉంటుందని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. దర్శి ఎల్‌పీ రోడ్డులోని ఆమె స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొని, మాట్లాడారు. అన్న నందమూరి తారక రామారావు 40 ఏళ్ళ కిందట తెలుగు వారి ఆత్మగౌరవం కాపాడిన వ్యక్తి. దేశ విదేశాలలో తెలుగువారికి సముచిత స్థానం కలుగజేసిన వ్యక్తి. ఆరు నెలల కాలంలో తెలుగుదేశం పార్టీని స్థాపించి అధికారంలోకి రాగలిగిన ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం పార్టీ. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గా, అన్ని వర్గాల ప్రజల కలయికగా ప్రజల పార్టీగా తెలుగుదేశం ప్రజల గుండెల్లో గూడు కట్టుకుందని తెలిపారు.

ఎన్టీఆర్ తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పార్టీని ముందుకు తీసుకు




వెళుతూ అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్నారు. ఇప్పటికే 70 లక్షల సభ్యత్వంతో దేశంలో బలమైన ప్రాంతీయ పార్టీగా ఎదిగింది. తిరిగి సభ్యత్వానికి శ్రీకారం చుట్టడం ఒక శుభ పరిణామం. ప్రతి కార్యకర్త సభ్యత్వానికి బాధ్యతగా నారా లోకేష్ సరికొత్తగా ఆలోచించి రూ. రెండు లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ సభ్యత్వ కార్యక్రమాన్ని దర్శి నియోజకవర్గంలో కూడా గతం కంటే రెట్టింపు ఉత్సాహంతో చేయాలి. ప్రతి కార్యకర్త సభ్యత్వాన్ని తీసుకొని కూటమి ప్రభుత్వంలో




కార్యకర్తల బలాన్ని నిరూపించాల్సిన అవసరం ఉందని లక్ష్మి తెలిపారు. శాంగించారు.

ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యుడు నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్స్, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుండగా, నియోజకవర్గం లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చవలం సీతా రామయ్యకు రూ.2 లక్షలు, పోకూరి నాగ పావని రూ.35,538, భేతంశెట్టి శివ రూ.30,786 చెక్కులను గొట్టిపాటి లక్ష్మి పంపిణీ చేశారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 26, అక్టోబర్ 2024 ||



నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ద్వారా అంతర్జాతీయ విపత్తు రిస్క్ తగ్గింపు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఆర్ఎంఏపీ నుండి సినీ కళాకారులు ప్రతిష్ఠాత్మకమైన జాతీయ స్థాయి లఘు చిత్రాల పోటీలో పాల్గొని రెండో బహుమతిని గెలుచుకున్నారు. ఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్‌లో ఎన్ఐడిఎం బృందం నిర్వహించిన గ్రాండ్ వేడుకలో వారికి 1.5 లక్షల నగదు బహుమతిని అందజేశారు. ఈ బహుమతిని సాంస్కృతిక శాఖ మంత్రి, పర్యాటక శాఖ మంత్రి గగేంద్ర సింగ్ షెకావత్ ప్రదానం చేశారు. టీమ్ సినిమాట్స్ సభ్యులు మూడో సంవత్సరం నుండి షణ్ముఖ శివ దుర్గేష్, నాలుగో సంవత్సరం నుండి సాంబశివరావు అవుల, రెండో సంవత్సరం నుండి తాహీర్ షేక్ ఉన్నారు.





## నవంబర్ రెండవ వారంలో హుస్నాబాద్‌లో

# మెగా ఫారిన్ జాబ్ మేళా

- అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి వారి స్కిల్స్ ఆధారంగా జాబ్స్
- వివిధ దేశాల వారీగా స్టాల్స్ ఏర్పాటు చేసేలా టాంకాం ప్రతినిధులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం..
- హుస్నాబాద్ నిరుద్యోగ యువత ఫారిన్ జాబ్ మేళా కు ఎన్ రోల్మెంట్ చేసుకోవాలని పిలుపునిచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,మహానాడు:

అభివృద్ధి చెందిన దేశాల్లో భారీ వేతనాలతో ఉన్న ఉద్యోగ అవకాశాలు పొందేలా రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలోని వారి ఛాంబర్ లో టాంకాం ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

హుస్నాబాద్‌లో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి వివిధ రంగాల్లో వారికి ఉన్న స్కిల్స్ ఆధారంగా వివిధ దేశాల్లో మంచి జీతాలతో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మెగా ఫారిన్ జాబ్ మేళా ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నవంబర్ మొదటి వారంలో జరిగే జాబ్ మేళా కోసం మండలాల్లో అవగాహన కల్పించాలని మూడు జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత డేటా సేకరించి వారికి ఆసక్తి ఉన్నా విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రోత్సహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

# స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం

- పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్
- స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను పరిశీలించిన మంత్రి టి.జి భరత్

కర్నూలు, మహానాడు:

కర్నూలులో రాష్ట్ర స్థాయి క్యాన్సర్ హాస్పిటల్ సేవలను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామనిరాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. కర్నూల్ మెడికల్ కాలేజీ ఆవరణలోని రాష్ట్ర స్థాయి క్యాన్సర్ హాస్పిటల్‌ను జిల్లా కలెక్టర్



పి. రంజిత్ బాషా, అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పలు విభాగాలు తిరిగి సమస్యలు తెలుసుకున్నారు.

పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ 2019 జనవరిలో సీఎం చంద్రబాబు నాయుడు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పుడు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు సీఎం చంద్రబాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడుతున్నట్లు చెప్పారు.

రాష్ట్ర స్థాయి క్యాన్సర్ హాస్పిటల్లో అత్యున్నతమైన వైద్య సేవలు ప్రజలకు అందేలా అన్ని విధాలా చర్యలు తీసుకుంటామన్నారు. రోగులు వైద్యం కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా ఇక్కడే ఉచితంగా వైద్యం అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

# అమరావతికి రైల్వేలైన్ రాష్ట్రానికి భారీ ప్రోత్సాహం

- ప్రధాని మోదీ, కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, సీఎం చంద్రబాబులకు ధన్యవాదాలు
- ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)

విజయవాడ,మహానాడు:

కేంద్రమంత్రి వర్గంలో ఏపీకి ప్రాధాన్యత కల్పిస్తూ అమరావతి రైల్వే లైన్ కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపినందకు ప్రధాన మంత్రి



నరేంద్రమోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు, ఇందుకోసం కోసం కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.







## తానేటి వనిత తన అక్క అంటూ..

# రూ. 10 లక్షలు దోపిడీ!

- వైసీపీ రిగ్గింగ్ ను అడ్డుకున్న టీడీపీ నేతలపై రౌడీషీట్
- ఉద్యోగాలను తొలగించి వైసీపీ తమను రోడ్డున పడేసిందంటూ ఏఎన్ఎంల మొర
- వైసీపీ నేతలు పెట్టిన అక్రమ కేసులు తొలగించాలని టీడీపీ కార్యకర్తల విన్నపం

మంగళగిరి, మహానాడు:

తానేటి వనిత తనకు అక్క అవుతుందని చెప్పి సబ్ రిజిస్ట్రర్ యూనియన్ ప్రెసిడెంట్ తనకు బావ అవుతాడని చెప్పి కొవ్వూరు సబ్ రిజిస్ట్రర్ ఆఫీసు వద్ద లేఖరుగా పనిచేస్తున్న దాసరి స్టాలిన్ తమ కూతుర్లకు చెందాల్సిన ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తానని తమ వద్ద రూ. 10 లక్షలు తీసుకుని మోసం చేశాడని.. ఇంటికి వెళ్లి అడిగితే చంపేస్తామని బెదిరిస్తున్నాడని ఏలూరు జిల్లా ఏలూరుకు చెందిన బలే నరసరాజు తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలు మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిలకు అర్జీ ఇచ్చి ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల నుండి అర్జీలు స్వీకరించిన నేతలు అధికారులతో ఫోన్లలో మాట్లాడి వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

- 2024 ఎన్నికల్లో వైసీపీ నాయకులు రిగ్గింగ్ కు పాల్పడుతుంటే అడ్డుకున్నందుకు తమను పోలీసులు స్టేషన్ కు పిలిచి తమ మీద రౌడీ షీట్ ఓపెన్ చేశారని.. దయచేసి తమపై పెట్టిన రౌడీషీట్‌ను తొలగించాని దర్శి నియోజకవర్గం బొట్లపాలెం గ్రామానికి చెందిన బత్తిన శ్రీకాంత్, బొట్ల వెంకటేశ్వరరావు, బత్తిన వెంకట నరేంద్ర బాబు, రాఘవలు విజ్ఞప్తి చేశారు.
- ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తూ.. గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు అర్జీ ఇచ్చినా తమ సమస్యలను పట్టించుకోలేదని.. ప్రమోషన్లతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని వారు మంత్రి గొట్టిపాటి రవికుమార్ కు వినతి ఇచ్చి అభ్యర్థించారు.
- ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి.. రాజశేఖర్ రెడ్డి, నిరంజన్ రెడ్డిలు తన వద్ద రూ. 12 లక్షల తీసుకుని మోసం చేశారని.. డబ్బులు అడిగితే కులం పేరుతో తిడుతున్నారని.. కొడుతున్నారని.. తనకు ఆడపిల్లలు ఉన్నారని.. దయచేసి డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని అనంతపురం జిల్లా రాప్తాడు మండలం పుల్లలరేవు గ్రామానికి చెందిన పి.సి పెద్దన్న కోరారు.
- అధికారులే రికార్డులు తారుమారు చేస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని.. తన తండ్రి పేరుమీద ఉన్న పొలాన్ని వేరొకరికి కట్టబెట్టేందుకు తన తండ్రి ఫోటో తీసి మరొకరి ఫోటోతో పాసుపుస్తకాలు సృష్టించారని.. దీనిపై విచారించి తమకు న్యాయం చేయాలని, తప్పుడు పనులు చేస్తున్న అధికారులను ఉద్యోగాల నుండి తొలగించాలని ప్రకాశం జిల్లా కనిగిరి మండలం వంగపాడు గ్రామానికి చెందిన కాకర్ల కొండయ్య, కాకర్ల శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.
- వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దివ్యాంగుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని, ప్రభుత్వం, ఆప్కాస్ ద్వారా ఏ నియామకాలు చేపట్టినా కూడా దివ్యాంగులకు రోస్టర్ పాటించాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్లుగా పనిచేస్తున్న దివ్యాంగులను రెగ్యులర్ చేయాలని 2019 కంటే ముందు వివాహమైన దివ్యాంగులకు వివాహ ప్రోత్సాహం అందించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సభ్యులు నేతలను వేడుకున్నారు.
- తన భర్త చనిపోయిన సమయంలో తన ఇంట్లోని పాస్ పుస్తకాలు కొట్టేసి తన పొలాన్ని తన మరిది ఆక్రమించి మరొకరికి కౌలువుకు ఇచ్చాడని.. దానిపై ప్రశ్నిస్తే తనను చంపేందుకు యత్నిస్తున్నారని.. తనకు న్యాయం చేయాలని నెల్లూరు జిల్లా వింజమూరు మండలం నందిగుంట్ల గ్రామానికి చెందిన షేక్ షాహిన్ నేతలను కలిసి అభ్యర్థించారు.
- ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం గుమ్మళంపాడు గ్రామానికి చెందిన సర్పంచ్ సుబ్బారావు విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో బీసీలకు ప్రభుత్వం ఇండ్ల స్థలం కేటాయించిందని అక్కడ కరెంట్ సప్లైని ఏర్పాటు చేయాలని మంత్రికి విన్నవించారు.
- 22 ఏళ్ళ నుండి ఏఎన్ఎమ్ లుగా పనిచేస్తున్న తమను గత ప్రభుత్వం అన్యాయంగా తొలగించింది. తొలగింపపడిన వారం దరూ దళిత బడుగు బలహీన వర్గాల వారే. గత ప్రభుత్వంలో న్యాయం కోసం ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోలేదు. దీనిపై కోర్టుకు వెళ్ళామని దయచేసి వైసీపీ ప్రభుత్వం తొలగించిన 203 మందికి ఏఎన్ఎమ్ ఉద్యోగాలు కల్పించాలని వారు వేడుకున్నారు.
- విజయనగరం జిల్లా గరివిడి మండలం కోసూరు గ్రామానికి చెందిన అప్పల నాయుడు విజ్ఞప్తి చేస్తూ.. వారసత్వంగా వచ్చిన భూమిని వైసీపీ నేతలు అక్రమంగా ఆక్రమించుకోని వారి పేరుపైకి మార్చుకోవడమే కాకుండా తమపై అక్రమ కేసులు బనాయించారని.. దానిపై విచారించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.
- విజయనగరం జిల్లా గరివిడి మండలం కోసూరు గ్రామానికి చెందిన సూర్యనారాయణ విజ్ఞప్తి చేస్తూ.. వైసీపీ నేతలు తనపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని.. తాను గుండె ఆపరేషన్ చేసుకున్నా కనికరించడం లేదని, దయచేసి తనపై అక్రమ కేసులను పరిశీలించి వాటిని తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.
- ఏపీ జెన్ కో, ఏపీ ట్రాన్స్‌కో, డిస్కాంల్లో అనేక సంవత్సరాలుగా 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులమైన తాము చాలీచాలని జీతంతో పనిచేస్తున్నామని తమ సమస్యలను పరిష్కరించి తమను పర్మినెంట్ చేయాలని వారు నేడు ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విజ్ఞప్తి చేశారు.
- పోలవరం ప్రాజెక్ట్ ముంపునకు గురవుతున్న పట్టా భూమికి కొత్తగా అవార్డు నోటిఫికేషన్ ఇచ్చి నష్టపరిహారం ఇప్పించవలసిందిగా చింతూరు మండలం చింతూరుకు చెందిన సోమక నారాయణరావు విజ్ఞప్తి చేశారు.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్ట్ & క్రాఫ్ట్ నిరుద్యోగ ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తూ.. ఉన్నత పాఠశాలల్లో డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్ ఉపాధ్యాయుల నియామకానికి 2024 డిఎస్సీలో ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.







# దీపావళి నుంచి ఉచిత గ్యాస్...మహిళల సంబరాలు!

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, మహానాడు:

ఎన్డీయే ప్రభుత్వం దీపావళి పండుగ కానుకగా ఉచిత గ్యాస్ సిలెండర్ ఇవ్వనుందన్న ప్రకటనతో మహిళల నుండి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళ మాధవి పేర్కొన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో తెలుగు మహిళలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫ్లెక్సికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా వాటిని నెరవేర్చే క్రమంలో మరో ముందడుగు వేశారని తెలిపారు. అర్హులైన ప్రతి మహిళకు ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలవుతుందన్నారు. దీనిపట్ల మహిళల నుండే కాక ప్రజల నుండి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయన్నారు.

దీన్ని చూసి తట్టుకోలేక జగన్మోహన్ రెడ్డి లాంటి వారు ఎన్ని విష ప్రచారాలు చేసిన ప్రజలందరూ తమవైపే ఉంటారన్నారు.

ఈ కార్యక్రమంలో దాసరి జ్యోతి, డాక్టర్ కల్పన, నేపాక పద్మ, కార్పొరేటర్ శ్రీవల్లి, లాం నవమి, విజయలక్ష్మి, వకుల దేవి, మీనాక్షి, కరిమూన్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

**పీవీకే నాయుడు మార్కెట్ ఎమ్మెల్యే సందర్శన**

పశ్చిమ నియోజకవర్గంలోని పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్ ఎమ్మెల్యే గళ్ళా మాధవి శుక్రవారం సందర్శించారు. ఈ



సందర్భంగా ప్రజలు, వ్యాపారస్తుల నుండి అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మార్కెట్‌లో ఉన్న మరుగుదొడ్లు నిర్లక్ష్యం కారణంగా శిథిలమైపోయాయని గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులను పిలిచి,ఈ మరుగుదొడ్లను వాడుకలోకి తీసుకురావాలని ఆదేశించారు. వర్షాకాలంలో వరద నీరు మొత్తం మార్కెట్‌లో నిలిచి పోతున్నదని వ్యాపారస్తులు తెలపగా, అధికారులను వీటి సమస్య పరిష్కారానికి మార్గాలను అన్వేషించి, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాదు రాజేష్, నిమ్మల రమణ, లాం వర్ధన్ రావు, ఆళ్ళ హరి, ఖర్జూర శ్రీను, దళవాయి కిషోర్, శర్ఫుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# వైన్, ఇసుక మీద ఉన్న శ్రద్ధ మంచినీళ్ల మీద లేదు

- గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి విమర్శ

**నరసరావుపేట, మహానాడు:** గురజాలలో ఈరోజు నీళ్లు కూడా లేని దుస్థితి ఏర్పడింది... దాచేపల్లిలో ప్రజలు మంచినీరు తాగాలి అంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది... గత ఐదేళ్లలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు జరగలేదు. దాచేపల్లిలో డయేరియాతో ఇద్దరు చనిపోవడం బాధాకరమని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో ఏమన్నారంటే.. ప్రభుత్వం కనీసం మంచినీళ్లు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. మాకు మంచి నీళ్లు లేవని జిల్లా అధికారులకు ఫోన్‌లు చేసినా పట్టించు కోలేదు...



పల్నాడు జిల్లాలో తెలుగుదేశం పార్టీ(టీడీపీ) నేతలకు వైన్, ఇసుక మీద ఉన్న శ్రద్ధ మంచి నీళ్ల మీద లేదు... పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తేలేకపోతున్నారు...

దాచేపల్లిలో డయేరియాతో మృతిచెందిన రెండు కుటుంబాలకు 50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి... మంచినీరు బాగోలేవని స్థానిక టీడీపీ కౌన్సిలర్ దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదు... మున్సిపల్ అధికారులు ఒక్కరు కూడా అందుబాటులో ఉండటం లేదు... మంచినీరు ఇవ్వడంలో స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.



# పేదల ఆరోగ్యానికి పెద్దపీట

- ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట, మహానాడు:** పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గానికి చెందిన 12 మంది బాధితులకు రూ. 10.65 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని 108,104 వాహనాలను మరింత అధునాతన పరికరాలతో రూపొందిస్తామన్నారు. ఈ వాహనాల ద్వారా ప్రాణాలకు కాపాడుతూ చికిత్సలు అందిస్తున్నారన్నారు.

# తెలుగు జాతి ఉన్నతే సీఎం చంద్రబాబు ధ్యేయం

- టీడీపీ అండమాన్ నికోబార్ దీవుల నేత మాణిక్యరావు

**విజయపురం,మహానాడు:** ఆంధ్రుల సంక్షేమం కోసం, తెలుగు జాతి ఉన్నతి కోసం, దేశ ప్రగతి కోసం పరితపించే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని.. అండమాన్ నికోబార్ దీవులకు చెందిన తెలుగుదేశం పార్టీ (టీడీపీ) రాష్ట్ర నాయకుడు ఎన్. మాణిక్యరావు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీపవాసులు తమ సంక్షేమం కోసం తమ సంరక్షణ కోసం అండమాన్ నికోబార్ దీవుల హక్కులను కాపాడుకునేందుకు తమ సమస్యల పరిష్కారానికి టీడీపీలో చేరేందుకు సిద్దంగా ఉన్నారని పేర్కొన్నారు. విజయనగరం ఎంపీ అప్పలనాయుడు, అండమాన్ నికోబార్ దీవుల జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర టీడీపీ ఇంఛార్జ్ మాధవ నాయుడులు నేడు విజయపురంను(పోర్ట్ బ్లెయిర్) సందర్శంచను న్నారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో అక్కడి ఆంధ్రా అసోసియేషన్ హాల్లో సాయంత్రం అయిదు గంటలకు టీడీపీ ఆన్ లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనునున్నట్టు మాణిక్యరావు తెలిపారు. దీవుల్లో ఉండే ప్రజల సంక్షేమానికి అందరూ టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

8

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 26, అక్టోబర్ 2024 ||

శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఇన్స్యూరెన్స్ విభాగం ఆధ్వర్యంలో మరణించిన పార్టీ కార్యకర్తల కుటుంబసభ్యులకు2 లక్షల రూపాయల చొప్పున చెల్లింపునకు సంబంధించిన మంజూరు పత్రాలు ఇవ్వడం జరిగింది. ఎవరైతే వివిధ ప్రమాదాల్లో దురదృష్టశాత్తూ మరణించిన వారి పార్టీ నామినీస్ కు బీఆర్ఎస్ పార్టీ రెండు లక్షల రూపాయల మంజూరు పత్రాలు 44 మందికి అందించడం జరిగింది ఈ కార్యక్రమం ఇన్సూరెన్సు ఇంచార్జి బి ఆర్ స్ పార్టీ జనరల్ సెక్రటరీ సోమా భారత్ కుమార్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, దివ్యాంగుల సంస్థ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## రేవంత్ రెడ్డి సొంత మంత్రులు

# ప్రతిపక్ష నేతల ఫోన్లు టాప్ చేస్తున్నారు

- 50 లక్షల రూపాయల బ్యాగుతో పట్టుబడిన రేవంత్ రెడ్డిని దొంగ అనకుంటే ఏమంటారు?
- తెలంగాణ ఏర్పాటు కోసం కాంగ్రెస్ లో విలీనం చేయాలనుకున్నాం
- కానీ కాంగ్రెస్ పార్టీ వల్లే విలీనం జరగలేదు
- ఫోన్ టాపింగ్ వ్యవహారంలో రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్
- హైదరాబాద్‌లో జరిగిన ఏబీపీ న్యూస్ సదరన్ సమ్మిట్‌లో పాల్గొన్న భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,మహానాడు:

రేవంత్ రెడ్డి సొంతమంత్రులు.. ప్రతిపక్ష నేతల ఫోన్లు టాప్ చేస్తున్నారు.దమ్ముంటే కెమెరాల ముందు ఈ అంశంలో లై డిటెక్టర్ పరీక్షకు రావాలి. రేవంత్ రెడ్డికి దమ్ముంటే నా సవాలు స్వీకరించి బహిరంగంగా ఫోన్ ట్యాప్ చేయడం లేదని ప్రకటించాలి.

తెలంగాణ రాష్ట్రంలో మంత్రులతో పాటు, నా ఫోన్ ట్రెపింగ్ చేయట్లేదని చెప్పాలి. సొంత పార్టీ ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నేతల ఫోన్‌లను కూడా ట్యాప్ చేస్తున్నారు.

రేవంత్ రెడ్డి ఫోన్ టాపింగ్ విషయంలో నాతోపాటు బహిరంగంగా కెమెరాల ముందు లై డిటెక్టర్ పరీక్షకు రావాలి. ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చిన తర్వాత కూడా రేవంత్ రెడ్డి అవే నీచమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. 50 లక్షల రూపాయల బ్యాగుతో పట్టుబడిన రేవంత్ రెడ్డిని దొంగ అనకుంటే ఏమంటారు? డబ్బు కట్టలతో సభ్యులను కొనాలనుకున్న రేవంత్ రెడ్డి పైన కేసు పెట్టాల్సి వచ్చింది

రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. 100 రోజుల్లోనే అనేక హామీలను నెరవేరుస్తామంటూ చెప్పి, ఆరు గ్యారెంటీలు కాదు హాఫ్ గ్యారెంటీలు మాదిరి అయి పోయింది. దేశంలో పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసిందే కాంగ్రెస్ పార్టీ. మా ప్రభుత్వ హయాంలో రాజ్యాంగబద్దంగా పార్టీ శాసనసభాపక్ష విలీనం జరిగింది.

రాహుల్ గాంధీ ఢిల్లీలో రాజ్యాంగం ప్రతులు పట్టుకొని తమాషా చేస్తారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగం ఖూనీకి గురైనప్పుడు మౌనం వహిస్తున్నారు. రాజ్యాంగం విలువల గురించి ఢిల్లీలో గోల చేసే రాహుల్ గాంధీ.. తెలంగాణలో మాత్రం మౌనంగా ఉంటున్నారు. మొహబ్బత్ కి దుకాణ్ అని చెప్పున్న రాహుల్ గాంధీ.. తెలంగాణ రాష్ట్రంలో నడుస్తున్న బుల్డోజర్ రాజ్యం గురించి మాట్లాడటం లేదు. కాంగ్రెస్ బుల్డోజర్ల నుంచి పేద ప్రజలను కాపాడటంపై రాహుల్ గాంధీ దృష్టి పెట్టాలి. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల అంచనాలు పెరగడం మా ఓటమికి ఉపకారణమైంది. మేం ప్రభుత్వ ఉద్యోగాలు భారీగా ఇచ్చినప్పటికీ.. ఆ విషయాన్ని ప్రజలకు చెప్పుకోవడంలో విఫలమయ్యాం. శాసనసభ ఎన్నికల ఓటమి తర్వాత అంతర్గతంగా సమీక్షించుకొని ప్రజల కోసం పోరాడటానికి ముందుకు వెళ్లాం.

సాధారణంగా భారతదేశంలో ఎన్నికలు అనేవి.. ఒకరి ఎంపిక కంటే అప్పుడు అధికారంలో ఉన్నవారిని తిరస్కరించడం కోసం జరుగుతుంటాయి. గత ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఎంపిక అనే కంటే, మా ప్రభుత్వాన్ని తిరస్కరించారని చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పాటు చేసిన పార్టీని, తెలంగాణ ఏర్పాటు కోసం కాంగ్రెస్‌లో విలీనం చేయాలనుకున్నాం. కానీ కాంగ్రెస్ పార్టీ వల్లే విలీనం జరగలేదు. అదృష్టవశాత్తు తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకువెళ్లే అవకాశం మాకు దొరికింది.

పది సంవత్సరాల్లో ఐటీ రంగం నుంచి వ్యవసాయ రంగం దాకా అన్ని రంగాలలో తెలంగాణ రాష్ట్రాన్ని అద్భుతంగా అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాం. అధికారం శాశ్వతమని మేం ఏనాడూ అనుకోలేదు. అధికారంలో ఉన్నప్పుడు మాత్రం రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలని మా సర్వశక్తుల ప్రయత్నం చేశాం. అందులో విజయం సాధించాం. ప్రస్తుతం ప్రతిపక్ష పాత్రలో ఉన్న మేము.. ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో, వారి ఆకాంక్షల కోసం పోరాటం చేయడంలో సంతృప్తిగా సంతోషంగా ఉన్నాం.

కుటుంబ నేపథ్యం వంటి అనే పాత చింతకాయ పచ్చడి విమర్శలు చేసిన అనంతరం కూడా, మంత్రిగా విజయవంతంగా తన బాధ్యతలు నిర్వహించినప్పుడు అసంబద్ధమైన, అసత్యమైన విమర్శలు చేయడం అలవాటుగా మారింది. అందుకే నాపై అహంకారి వంటి అర్థంలేని విమర్శలను కాంగ్రెస్ పార్టీ చేస్తోంది.

నాపై ప్రతిపక్షాలు చేస్తున్న అవినీతి, అహంకారం వంటి విమర్శలను రుజువు చేయాలని సవాలు విసురుతున్నా. ప్రజలు ప్రభుత్వ పరిపాలన వంటి అంశాల్లో బేరీజు వేసుకుని ఒక నిర్ణయానికి వస్తారు. కచ్చితంగా మా ప్రభుత్వం.. కాంగ్రెస్, బీజేపీల కన్నా గొప్పగా పనిచేసింది.

రాజకీయాల్లో గెలుపు ఓటముల పట్ల చలించిపోయే తత్వం కేసీఆర్ ది కాదు. ఆయన బలమైన మనస్తత్వం, వ్యక్తిత్వం జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను చూసింది. కేసీఆర్ నిరంతరం భవిష్యత్తు కోసం ఆలోచిస్తున్నారు. తెలంగాణ కోసం ప్రణాళికలు రచిస్తున్నారు. కానీ అరచేతిలో స్వర్గం చూపించి మోసం చేసిన పార్టీ తీరుపైనా, ఆ పార్టీ పాలన వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపైన కేసీఆర్ ఆవేదన చెందుతున్నారు.

కచ్చితంగా ప్రజలు మరోసారి కేసీఆర్‌కి ముఖ్యమంత్రిగా పనిచేసే అవకాశం ఇస్తారని విశ్వసిస్తున్నాం. హైదరాబాద్ నగరంలో జరిగిన అభివృద్ధికి, రాష్ట్ర ప్రగతికి ప్రజలు పట్టం కట్టారు. వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నాను. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం కూడా అద్భుతమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతాంగానికి రైతుబంధు, రైతుబీమాతో సహా అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశాం.

200 రూపాయలు ఉన్న ఆసరా పెన్షన్లను 2 వేల రూపాయలకు పెంచాం. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు అన్నీ చేస్తామని చెప్పి ఆశ పెట్టింది. గ్రామీణ, నగర ప్రాంతాలు అన్నీ కూడా మా ప్రభుత్వ హయాంలో సమగ్రంగా, సమాంతరంగా అభివృద్ధి చెందాయి. గత పది సంవత్సరాల్లో అభివృద్ధి, ప్రభుత్వ పాలనపైనే ప్రధానంగా దృష్టి సారించాం. వాటిపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుతం పార్టీకి రెండున్నర దశాబ్దాలుగా నిర్మించుకున్న నాయకత్వం ఉంది. అన్ని గ్రామాల్లో ధృడమైన పార్టీ నిర్మాణం చెక్కుచెదరకుండా ఉంది. ఒక్క ఎన్నికల్లో ఎదురైన పరాజయంతో పార్టీకి వచ్చిన ఇబ్బందేమీ లేదు.

**ఎక్కువ మంది పిల్లలను కనాలన్న చంద్రబాబు వ్యాఖ్యలపై**

ఎక్కువ మంది పిల్లలను కనాలన్న చంద్రబాబు వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. ప్రస్తుతం ఉన్న జనాభాకు తగ్గట్టుగా మౌలిక వసతులే లేని పరిస్థితి. ముందుగా వాటిని కల్పించడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి.

జనాభా నియంత్రణపై దక్షిణ భారతదేశానికి స్పష్టమైన అవగాహన ఉంది. జనాభా తగ్గించుకుని క్రమశిక్షణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు డీ లిమిటేషన్ పేరుతో నష్టం చేయడం అన్యాయం.

## చిన్నముసిడివాడలో పీఠం

# గడ్డ భూములో ఉంది

- విషయం సున్నితమైనది కావడంతోపై అధికారుల ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం
- శారదా పీఠానికి మరో ఎదురు దెబ్బ
- పెందుర్తి ఎంఆర్ఓ ఎం.ఆనంద్ కుమార్



పెందుర్తి,మహానాడు:

చిన ముషిడివాడలోని శారదా పీఠానికి మరో ఎదురు దెబ్బ తగిలింది. పీఠానికి చెందిన సుమారు 20 సెంట్లు భూమి గడ్డ స్థలంలో ఉందని పెందుర్తి ఎంఆర్ఓ ఎం.ఆనంద్ కుమార్ ప్రకటించారు.

ఇదే విషయమై ఆయన తమ కార్యాలయంలో శుక్రవారం మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ.. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఫిర్యాదు ప్రకారం రికార్డులను పరిశీలించిన అనంతరం శారదా పీఠానికి చెందిన కొంత భూమి గడ్డ స్థలంలో ఉందన్నారు. అయితే ఆ భూమిని స్వాధీనం చేసుకునే అధికారం తనకు లేదని.. తమపై అధికారులు ఆదేశాల ప్రకారం నడుచుకుంటామన్నారు. విషయం సున్నితమైనది కావడంతో పై అధికారులు దృష్టికి తీసుకువెళతామని పేర్కొన్నారు.

**శారదా పీఠం ఆక్రమణలపై చంద్రబాబుని కలుస్తా : తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్**

శారదా పీఠం భూమి గడ్డలో ఉందని ఎమ్మార్వో ప్రకటించిన నేపథ్యంలో బి.వి.రామ్ మీడియాతో మాట్లాడుతూ.. శారదా పీఠం అక్రమాలపై మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలుస్తానన్నారు. శారదా పీఠంతో పాటు రాష్ట్రంలో ప్రభుత్వ భూమి ఎక్కడ కూడా అన్యాక్రాంతం కాకూడదని తెలుగు శక్తి ప్రధాన ఉద్దేశం అన్నారు.

అయితే శారదా పీఠం కేవలం వైసీపీ పీఠం అని వ్యాఖ్యానించారు. అందుకు ప్రత్యక్ష నిదర్శనం.. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు శారదా పీఠానికి అధిక ప్రాధాన్యత ఇచ్చే వారని.. ప్రత్యేకంగా శారదా పీఠానికి వచ్చి స్వామీజీ ఆశీస్సులు పొందేవారన్నారు. తీరా అధికారం కోల్పోయిన తర్వాత శారదాపీఠం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్నారు.

నిన్న విజయనగరం పర్యటన కోసం వచ్చిన వైయస్ జగన్ శారదా పీఠానికి రాకపోవడం అతని నిర్లక్ష్యానికి ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. వైసిపి ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పడంతో.. ఇప్పుడు ఆ వైసిపి నాయకులు కూడా ఇటువైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. ఏది ఏమైనప్పటికీ శారదా పీఠం ఇప్పటికే భీమిలిలో భూములు కోల్పోయిందని, తిరుమలలో భూములు కోల్పోయిందని, ఇప్పుడు ఇక్కడ కూడా భూమిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని రామ్ పేర్కొన్నారు.

## సరస్వతి పవర్ భూముల్లో

# అటవీ భూములున్నాయా?

- జల వనరులున్నాయా? పర్యావరణ అనుమతులు ఏ విధంగా పొందారు?
- ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆరా



అమరావతి,మహానాడు:

పల్నాడు జిల్లా దాచేపల్లి, మాచవరం మండలాల్లో సరస్వతి పవర్ సంస్థకు చెందిన భూముల్లో అటవీ భూములు ఏవైనా ఉన్నాయా? ఉంటే వాటి విస్తీర్ణం ఎంత ఉందో నివేదిక ఇవ్వాలని అటవీ శాఖ అధికారులను, పల్నాడు జిల్లా యంత్రాంగాన్నీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

ఈ సంస్థకు 1515.93 ఎకరాల్లో ప్రకృతి సంపద, వాగులు, వంకలు, కొండ భూములు ఉన్నా యనే వార్తలు వెలుగు చూసిన క్రమంలో ఉప ముఖ్యమంత్రి అధికార యంత్రాంగంతో చర్చించారు. ఆ సంస్థకు చెందిన భూముల్లో ప్రభుత్వ భూములు, జల వనరులు ఏ మేరకు ఉన్నాయో తెలియచేయ డంతో పాటు, అటవీ భూములు ఏ మేరకు ఉన్నాయో సమగ్రంగా పరిశీలించవలసిన అవసరం ఉందని అధికారులకు స్పష్టం చేశారు.

వాగులు, వంకలు, కొండలు ఉన్నందున ఆ సంస్థకు పర్యావరణ అనుమతులు ఏ విధంగా పొందారో తెలియచేయాలని పి.సి.బి.కి ఆదేశాలు ఇచ్చారు. ఈ అంశంపై అటవీ, రెవెన్యూ, పీసీబీ ఉన్నతాధికారులతో త్వరలో ఉప ముఖ్యమంత్రి సమీక్షించాలని నిర్ణయించారు.

# ఇంకెప్పుడూ కేటీఆర్ గురించి అడ్డగోలు వ్యాఖ్యలు చేయొద్దు

- పరువు నష్టం కేసులో కొండా సురేఖకు కోర్టు మొట్టికాయలు
- ఇంకెప్పుడూ కేటీఆర్ గురించి అడ్డగోలు వ్యాఖ్యలు చేయవద్దని ఆదేశం
- కొండా సురేఖ వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్ , ఫేస్ బుక్, గూగుల్ ప్లాట్ ఫామ్ ల నుంచి తొలగించాలని ఆదేశం
- పరువు నష్టం కేసులో ఓ మంత్రికిపై కోర్టు ఇంత సీరియస్ అవటం ఇదే మొదటి సారి



హైదరాబాద్,మహానాడు:

కొండా సురేఖ తనపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన 100 కోట్ల పరువు నష్టం కేసులో కోర్టు మంత్రి కొండా సురేఖకు మొట్టికాయలు వేసింది. ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయంటూ మండి పడింది. ఓ బాధ్యత గల మహిళ మంత్రి ఇలాంటి కామెంట్స్ చేయటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని పేర్కొంది. కేటీఆర్‌పై కొండా సురేఖ వ్యాఖ్యలను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు సీరియస్ గా పరిగణించింది. భవిష్యత్‌లో ఇంకెప్పుడూ ఇలాంటి అడ్డగోలు వ్యాఖ్యలను కేటీఆర్ పై చేయవద్దని కొండాను సురేఖను ఆదేశించింది. అత్యంత జుగుప్సాకరంగా ఉన్న ఆ వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, వెబ్ సైట్లు, అన్ని సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్స్ నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది.

యూట్యూబ్, ఫేస్ బుక్, గూగుల్ సంస్థలకు కూడా ఈ వ్యాఖ్యలు ఉన్న వీడియోలను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. కొండా సురేఖ వ్యాఖ్యలను ప్రసారం చేసిన, కథనాలు ప్రచురించిన మీడియా సంస్థలకు కూడా కోర్టు ఆదేశాలు ఇచ్చింది.

ఈ కామెంట్లకు సంబంధించిన అన్ని కథనాలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఆయా సంస్థలను కోరింది. కొండా సురేఖ వ్యాఖ్యలు సమాజంలో చెడు ప్రభావాన్ని చూపుతాయని ఆమె వ్యాఖ్యలకు సంబంధించిన అన్ని కథనాలు, వీడియోలు పబ్లిక్ డొమైన్‌లో ఉండవద్దని కోర్టు తెలిపింది. పరువు నష్టం కేసుకు సంబంధించిన ఓ కేసులో మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై కోర్టు ఇంత ఆగ్రహం వ్యక్తం చేయటం ఇదే తొలిసారి. గతంలోనూ కొండా సురేఖ ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం ఈ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించింది.

# అర్హులకు దీపావళి నుండి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు!

- ఎల్.పి.జి కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు అర్హతగా ఈ పథకం అమలు
- ప్రతి ఏడాది రూ.2,684.75 కోట్ల మేర ప్రభుత్వం పై భారం
- అయిల్ కంపెనీలకు అడ్వాన్సుగా రూ.894.92 కోట్లను 29 న చెక్కు రూపేణా చెల్లింపు
- 29 నుండి గ్యాస్ బుకింగ్ ప్రారంభం, 31 న ప్రతి ఇంటికీ తొలి సిలిండర్ డెలివరీ
- గ్యాస్ బుక్ చేసుకున్న 24 గంటల్లో పట్టణ ప్రాంతాల్లో, 48 గంటల్లో గ్రామీణా ప్రాంతాల్లో డెలివరీ
- డెలివరీ చేసిన 48 గంటల్లోనే లబ్దిదారుల ఖాతాలోకి నేరుగా రాయితీ సొమ్ము జమ
- మొదటి సిలిండర్ మార్చి 31 లోపు, రెండోది జూలై 31 లోపు, మూడోది నవంబరు 30 లోపు ఎప్పుడైనా పొందవచ్చు
- టోల్ ఫ్రీ నెం.1967 కు ఫోన్ చేసి ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు
- ఈ పథకం అమలుకై విధి విదానాలను నిర్ధేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- రాష్ట్ర ఆహార & పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి, మహానాడు:

రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ఈ దీపావళి నుండే మూడు ఉచిత గ్యాస్ సిలిండ్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, మార్గదర్శకాలను, విధి విధానాలను నిర్దేశిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేస్తున్నట్లు రాష్ట్ర ఆహార,



పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంనాల్గోబ్లాక్ ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు. ఈ నెల 31 న ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, తదుపరి వెంటనే ప్రతి ఇంటికీ మొదటి గ్యాస్ సిలిండర్ డెలివరీ అవుతుం దన్నారు. ఎల్.పి.జి.కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు అర్హతగా ఈ పథకం అమలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్రంలో 1.55 కోట్ల గ్యాస్ కనెక్షన్లు, 1.47 కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయని, వీరిలో అర్హులు అందరికీ ఈ పథకం వర్తింప చేస్తామన్నారు. ఈ పథకం అమలుకై ప్రతి ఏడాది ప్రభుత్వం పై రూ.2,684.75 కోట్ల మేర భారం పడుతుందన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కుంటున్నా సరే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఈ పథకం అమల్లో భాగంగా ఈ నెల 29 నుండి గ్యాస్ బుకింగ్స్ ప్రారంభం అవుతుందని, గ్యాస్ బుకింగ్ చేసుకోగానే ఒక ఎస్.ఎం.ఎస్. సంబంధిత లబ్దిదారుని ఫోన్ నెంబరుకు వెళుతుందని, గ్యాస్ బుక్ చేసుకున్న 24 గంటల్లో పట్టణ ప్రాంతాల్లో, 48 గంటల్లో గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ సిలిండ్లను డెలివరీ ఉంటుందన్నారు. అదే విధంగా గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసిన 48 గంటల్లోనే డి.బి.టి. విధానం ద్వారా లబ్దిదారుల ఖాతాలోని నేరుగా రాయితీ సొమ్ము జమవుతుందని తెలిపారు.

ప్రభుత్వం అందజేసే మూడు ఉచిత సిలిండర్లలో మొదటి సిలిండర్ మార్చి 31 లోపు, రెండోది జూలై 31 లోపు, మూడోది నవంబరు 30 లోపు ఎప్పుడైనా పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ పథకం అమలుకై ఏడాదిని మూడు బ్లాక్ పీడియడ్లుగా పరిగణించడం జరుగుతుందని, మొదటి బ్లాక్ పీడియడ్ ఏప్రిల్ 1 నుండి జూలై 31 వరకు, రెండో బ్లాక్ పీడియడ్ ను ఆగస్టు 1 నుండి నవంబరు 31 వరకు, మూడో బ్లాక్ పీడియడ్ ను డిసెంబరు 1 నుండి మార్చి 31 వరకు పరిగణిస్తామని చెప్పారు. ఈ పథకం అమల్లో లబ్ధిదారులకు ఏమన్నా సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నెం.1967 కు ఫోన్ చేసి ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చన్నారు.

ఈ పథకం అమలుకు సంబంధించి ఇప్పటికే మూడు ఆయిల్ కంపెనీలతో మాట్లాడామని, ఆయిల్ కంపెనీల వద్ద, ప్రభుత్వం వద్ద ఉన్న డాటాను అనుసంధాపరుస్తూ ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు వివరించారు. ఈ పథకం అమలుకు ఆయిల్ కంపెనీలకు అడ్వాన్సుగా రూ.894.92 కోట్లను ఈ నెల 29 న చెక్కు రూపేణా చెల్లిస్తామని చెప్పారు.

అనంతరం పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెపుతూ రాష్ట్రంలో ఉన్న 1.55 కోట్ల గ్యాస్ కనెక్షన్లలో కేవలం 9.65 లక్షల గ్యాస్ కనెక్షన్లకు మాత్రమే ప్రధాన మంత్రి ఉజ్వల యోజనా పథకం వర్తింపు అవుతుందన్నారు. కాకినాడలో 52 వేల మెట్రిక్ టన్నుల్లో 27 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పి.డి.ఎస్. రైస్ గా గుర్తించామని, 11 మందిపై కేసులు పెట్టామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే చెల్లింపులు చేస్తున్నామని, ఇప్పటి వరకూ 147 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేసి 24 గంటల్లోపే దాదాపు రూ.34 లక్షలను చెల్లించామని చెప్పారు.

రాష్ట్రంలోనే తొలిసారిగా ధరల స్థిరీకరణకై ఒక కమిటీని ముఖ్యమంత్రి వేశారని, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఆ కమిటీకి చైర్మన్ ఆర్థికం, ఆరోగ్య, వ్యవసాయ శాఖల మంత్రులు సభ్యులుగా ఈ కమిటీలో ఉన్నారన్నారు. ఈ కమిటీ ఏర్పాటు అయిన తదుపరి కందిపప్పు రేటును రూ.180/- నుండి రూ.160/-కి తదుపరి రూ.150/-తగ్గించే విధంగా హోల్ సేల్ డీలర్లతో చర్చలు జరిపినట్టు తెలిపారు. ఎవరూ ఊహించని విధంగా రేషన్ డిపోల ద్వారా కేజీ కందిపప్పు కేవలం రూ.67/- లకే సరఫరా చేస్తున్నామని తెలిపారు. పామాయిల్ పై ఉన్న కస్టం డ్యూటీని కేంద్రం 7 శాతం నుండి 27 శాతానికి పెంచిన నేపథ్యంలో రూ.92/-ల ఉన్న దాని ధర దాదాపు రూ.130/- లకు పెరిగిందన్నారు. అయితే తమ కమిటీ చొరవతో దాని ధర రూ.110/- లకు తగ్గించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2,300 అవుట్ లెట్స్ ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.

ఉల్లిపాయి, టొమాటా ధరలను నియంత్రించేందుకు మార్కుఫెడ్ సహకారంతో రాయితీపై తక్కువ ధరలకే అన్ని కేంద్రాల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచామని, జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అర్హులైన వారందిరికీ 2029 వరకూ ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేసే విధంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అయితే రాష్ట్రంలోనున్న తెల్ల కార్డుల్లో 60 శాతం కార్డులకు మాత్రమే ఈ పథకం వర్తింపు అవుతోందని, మిగిలిన 40 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నట్టు మంత్రి తెలిపారు.

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్, కార్యదర్శి వీరపాండ్యన్, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 26, అక్టోబర్ 2024 ||




జలవనరుల శాఖ మంత్రి జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామానాయుడు తూర్పుగోదావరి జిల్లా లోని కొవ్వూరు మండలం వాడపల్లి ఇసుక రీచ్ ను ఆకస్మికంగా తనిఖీ



కార్తీ మాసం సందర్భంగా సూర్యలంక సముద్ర తీరానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు గురించి బాపట్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు




బిజెపి వారధి కార్యక్రమంలో వినతులను స్వీకరిస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి





మానవత్వం మంట కలిసింది. మనుషులమనే విచక్షణ మరిచిపోయారు. చేసిన పనికి గాను డబ్బులు అడిగిన పాపానికి ఇద్దరు యువకులపై మూకుమ్మడిగా దాడి చేసిన సంఘటన, మేడిపల్లి పీఎస్ పరిధి బోడుప్పల్ కార్పొరేషన్‌లో గురువారం నాడు చోటు చేసుకుంది.

## 55 వేల అంగన్వాడీ కేంద్రాల్లో
# ఎలక్ట్రిక్ ఇండక్షన్ స్టౌలు

**నిర్వీర్యమైన వీధిదీపాల నిర్వహణ ప్రాజెక్టును గాడిన పెట్టేందుకు సీఎం నిర్ణయం**

**గ్రామ, పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణ ప్రాజెక్టును గాడిన పెట్టేందుకు రూ.150 కోట్లు విడుదలకు సీఎం అంగీకారం**

**ఎనర్జీ ఎఫిషియన్సీ కార్యక్రమాలపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**అమరావతి,మహానాడు:**
రాష్ట్రంలో ఎనర్జీ ఎఫిషియన్సీ కార్యక్రమాలపై ఆ సంస్థ ప్రతినిధులు, అధికారులతో సీఎం చంద్రబాబు నాయుడు సచివాలయంలో సమీక్ష చేశారు. రాష్ట్రంలోని వివిధ గ్రామ పంచాయితీల్లో వీధి దీపాల నిర్వహణకు రూ.100 కోట్లు, పట్టణ ప్రాంతాలకు రూ.50 కోట్లను విడుదల చేయాలని సీఎం ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు.

ఇంధన వాడాకాన్ని తగ్గించేందుకు నూరు శాతం ఎల్ఈడి దీపాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయితీలను పూర్తిగా నిర్వీర్యం చేయడంతో పాటు వీధి దీపాల నిర్వహణకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించ లేదన్నారు. సాంకేతికతను వినియోగించి వీధి దీపాల నిర్వహణను మానిటరింగ్ చేసి విద్యుత్ ఆదాకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎల్ఈడీ దీపాలు వినియోగించడం ద్వారా విద్యుత్ మిగులను 30 నుండి 60 శాతం వరకూ పెంచ వచ్చని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. గత తెలుగు దేశం హయాంలో చేపట్టిన బెస్ట్ పాలసీలను మళ్లీ అమల్లోకి తెచ్చి ఇంధన సామర్థ్యంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచాలన్నారు. రాష్ట్రంలోని 55 వేల అంగన్వాడీ కేంద్రాల్లో వంటగ్యాస్ వినియోగాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ ఇండక్షన్ స్టౌలను వినియోగించాలని, అందుకోసం ఎనర్జీ ఎఫిసియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

వీధి దీపాల నిర్వహణతో పాటు సమర్ధ విద్యుత్ వినియోగానికి సంబంధించి నివేదిక ఇచ్చేందుకు ఆర్థికశాఖ, ఇంధన శాఖతో పాటు ఈఈఎస్ఎల్ ప్రతినిధులతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంతకు ముందు ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ సిఇఓ విశాల్ కపూర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎనర్జీ ఎఫిషియెన్సీ అంశాలకు సంబంధించి వివిధ అంశాలను



సీఎంకు వివరించారు.

### ఈ ఈఎస్ఎల్‌తో ప్రభుత్వం అవగాహనా ఒప్పందం

రాష్ట్రంలో 1.5 లక్షల గృహాలకు ఎనర్జీ ఎఫిషియెంట్ ఉపకరణాలతో విద్యుత్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇఇఎస్ఎల్ సంస్థతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (EESL) రాష్ట్రంలో ఎనర్జీ ఎఫిషియెన్సీ పెంచేందుకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (APSHCL), ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఎనర్జీ ఎఫిషియన్సీ కార్పొరేషన్ లిమిటెడ్ తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇఇఎస్ఎల్, హౌసింగ్ కార్పొరేషన్‌తో సమన్వయంతో అదనంగా మరో 9 లక్షల ఇళ్లకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ఈ సమావేశంలో రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర మున్సిపల్ శాఖమంత్రి పి.నారాయణ, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, పిఆర్ అండ్ ఆర్డి ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ఆర్థికశాఖ కార్యదర్శి జానకి, సియం కార్యదర్శి ప్రద్యుమ్న, ఎండి జెన్కో చక్రధర్ బాబు, ఏపీ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీస్ లిమిటెడ్ సిఇఓ విశాల్ కపూర్,ఇతర ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం కాటన్ అతిథి గృహంలో శుక్రవారం రాత్రి ఉచిత ఇసుకపై జిల్లా నేతలు, అధికారులు, మైనింగ్, రెవెన్యూ ,ఇరిగేషన్ అధికారులతో తూర్పు గోదావరి జిల్లా ఇంచార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష నిర్వహించారు.సమీక్షలో పాల్గొన్న ఎమెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్,బత్తుల బలరామకృష్ణ ,ముప్పిడి వెంకటేశ్వరరావు, కలెక్టర్ ప్రశాంతి, జేసీ ఎస్. చిన్నరాముడు, ఆర్డీవో లు రాణి సుస్మిత, ఆర్. కృష్ణ నాయక్, పోలవరం సీఈ నరసింహ మూర్తి , ఎస్ ఈ జీ. శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



సిబ్బంది సమస్యల పరిష్కారంకు ప్రత్యేకంగా “పోలీసు వెల్ఫేర్ డే” నిర్వహించిన విజయనగరం జిల్లా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్





రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌ను సన్మానించిన ఉండి టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు.











వరంగల్‌లోని ఓసిటీలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కొండా సురేఖ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దాదాపు నాలుగు గంటల పాటు ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించిన మంత్రి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వారి సమస్యలను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. పలువురి వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజల శ్రేయస్సే పరమావధిగా ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటానని మంత్రి సురేఖ పునరుద్ఘాటించారు. తాను హైదరాబాద్ లో ఉన్న సమయంలో పార్టీ నాయకులు ప్రజలకు అందుబాటులో వుంటారని మంత్రి తెలిపారు.



వికారాబాద్: మహాలక్ష్మి పథకం క్రింద అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ప్రొసిడింగ్స్‌ను ఈరోజు పంపిణీ చేసిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్



డిజిటల్ న్యూస్ పేపర్

శనివారం 26, అక్టోబర్ 2024

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com






Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144

డిజిటల్ న్యూస్ పేపర్
శనివారం 26, అక్టోబర్ 2024

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com

డిజిటల్ మీడియాలో ..
# జయహో "మహానాడు"
# 2,31,936
## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1న ప్రారంభమైన మన
మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న
మా అభిమాన పాఠకుల
అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్
మార్తి సుబ్రమణ్యం
సంపాదక సారధ్యంలో





బోడేపూడి సుబ్బారావు (BSR)
సారధ్యంలో

